thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

ఏషియన్ గేమ్స్ క్వార్టర్స్‌కు భారత జట్టు



# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 116| జగిత్యాల | శనివారం 25 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



## ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

- సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు
- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి విస్తరించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మణుగూరు ఓసీ, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పరిశీలన

కొత్తగూడెం, జూలై 24 : సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంత ర్జాతీయ స్థాయికి విస్తరించడాని కి ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణి

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం





- విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు
- డ్రగ్స్ నిర్మూలనకు కొత్త నిబంధనల రూపకల్పనకు సీఎం ఆదేశాలు
- క్యాంపస్‌లో ఘటనలు జరిగితే యాజమాన్యాలదే పూర్తి బాధ్యత
- టోల్‌ఫ్రీ నంబర్లు, క్యూఆర్ కోడ్‌లతో గోప్య ఫిర్యాదుల వ్యవస్థ
- డీ-అడిక్షన్, కౌన్సెలింగ్, కఠిన శిక్షలతో త్రిస్థాయి కార్యాచరణ
- అవసరమైతే కొత్త చట్టం తీసుకురావాలని అధికారులకు సూచన

హైదరాబాద్, జూలై 24: రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ప్రభుత్వం, డ్రగ్స్ వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, ముఖ్యంగా విద్యాసంస్థలను డ్రగ్స్ ప్రభావం నుంచి కాపాడేందుకు యాజమాన్యాలకే పూర్తి బాధ్యతలు అప్పగించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

**విద్యాసంస్థలపై పూర్తి బాధ్యత**

విద్యాసంస్థల ప్రాంగణంలో డ్రగ్స్‌కు సంబంధించిన ఏ ఘటన జరిగినా సంబంధిత యాజమాన్యాన్నే బాధ్యులుగా పరిగణించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారాలతో పాటు స్పష్టమైన బాధ్యతలు కూడా యాజమాన్యాలకు అప్పగించాలని సూచించారు. అలాగే క్యాంపస్ వెలుపల అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించే వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ముందుగానే గుర్తించేందుకు ప్రతి విద్యాసంస్థలో

మిగతా 2వ పేజీలో..

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదో రోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

4





## భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

- ఉచిత కరెంటు ఇస్తే ఆదాయం రాదనే భయం
- నారుమళ్ల సమయంలో కరెంటు కోతలు పెట్టడమేంటి?
- నీళ్లు లేక మహిళలు బిందెలు మోస్తున్నారు
- సోలేపేట సబ్‌స్టేషన్‌ను తనిఖీ సందర్భంగా హరీష్‌రావు

2



## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

- కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

3

## ట్రాఫిక్‌కు ప్రత్యేక బ్యూరో

- రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రత్యేక బ్యూరో ఏర్పాటుకు ఆదేశాలు
- ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశం
- హైదరాబాద్‌లో స్మార్ట్ సిగ్నలింగ్, సిగ్నల్ ఫ్రీ కారిడార్లపై దృష్టి

2

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష



2



## సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

- సైబర్ భద్రతా ప్రమాణాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి
- సైబర్ సెక్యూరిటీపై వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ ఆనంద్

3

## కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి



- జల్ శక్తి శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి సాంకేతిక మార్గదర్శకాలు కోరాలి
- పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
- అధికారులకు మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 24: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తన అధ్యక్షతన కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణ, పాలమూరు

మిగతా 3వ పేజీలో..

## మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

- నవతరం స్వరం మారుతోంది
- యువతరంతో పెట్టుకోవద్దు
- హక్కుల కోసం పోరాడే వారిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు
- సీబీఐ, ఈడీలకు యువతరం భయపడదు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో కేటీఆర్

హైదరాబాద్, జూలై 24: మోడీజీ మీరు పెట్టుకోకూడని వారి తో పెట్టుకున్నారు, యువతరంతో పెట్టుకున్నారు. మోడీ గారు జాగ్రత్త పడండి. స్వరం మారుతున్నది రాజ్యం ఉలిక్కి పడాలని కేటీఆర్

మిగతా 3వ పేజీలో..





## జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నిలదీయండి

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్నీ పేపర్ లీకులే
- ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీక్
- మరి ఆనాడెందుకు రాజీనామా చేయలేదు?
- విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు శక్తులు
- ధర్నా చౌక్ ఎత్తేసినోడే ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేయడమా?
- కేటీఆర్ నిర్వాకంతో 27మంది చనిపోతే చర్యలేవి?
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి సంజయ్



హైదరాబాద్, జూలై 24 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో పరీక్షా పత్రాలు లీకయ్యాయని, మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. బీజేపీ

మిగతా 2వ పేజీలో..





## ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

- 1,569 కొత్త సబ్ సెంటర్ల నిర్మాణం
- పల్లెల్లోనే ఉచిత నిర్ధారణ పరీక్షలు
- గ్రామీణ వైద్యానికి మహర్దశ

హైదరాబాద్, జూలై 24: తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు ₹740 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప

మిగతా 3వ పేజీలో..

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

- వారందరికి కెటిఆర్ రూ.2 కోట్లు చొప్పున చెల్లించాలి
- బర్త్‌డే రోజయినా అబద్దాలు మాట్లడకుండా ఉండలేడు
- మీడియా సమావేశంలో మండిపడ్డ పిసిసి చీఫ్



3

## ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

- నీట్ వివాదం తర్వాత పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సిద్ధం
- ఎన్టీఏలో 47 మంది అధికారుల తొలగింపు
- పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంపుపై కేంద్రం దృష్టి
- అవుట్‌సోర్సింగ్ విధానంలో సమూల మార్పులకు కసరత్తు
- ప్రశ్నాపత్రాల భద్రతకు కొత్త వ్యవస్థ అమలు చేసే యోచన

2

# ట్రాఫిక్‌కు ప్రత్యేక బ్యూరో

**హైదరాబాద్, జూలై 24:**
రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసి సంస్థాగత నిర్మాణంతో కూడిన ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత చర్యలను పర్యవేక్షించాలని సూచించారు.

**క్రమబద్ధీకరణపైనే ప్రధాన దృష్టి**
ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలుకంటే క్రమబద్ధీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, వాతావరణ పరిస్థితులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

**ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాల నివారణకు చర్యలు**
ఔటర్ రింగ్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఆర్‌పై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, రహదారి భద్రతకు సంబంధించిన చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.

**స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థపై దృష్టి**
హైదరాబాద్‌లో స్మార్ట్ సిగ్నలింగ్ విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అంతరాయం తగ్గించేందుకు అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోకుండా సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి**
ప్రత్యేక పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**గోప్య సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థ**
డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎలాంటి భయాందోళనలు లేకుండా అందించేందుకు విద్యాసంస్థల్లో టోల్‌ఫ్రీ నంబర్లు, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వీటి ద్వారా విద్యార్థులు, సిబ్బంది గోప్యంగా సమాచారం అందించే అవకాశాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**గుర్తింపు నుంచి శిక్ష వరకు త్రిస్థాయి ప్రణాళిక**
డ్రగ్స్ నిర్మూలనలో గుర్తించడం-మాన్పించడం-శిక్షించడం అనే త్రిస్థాయి కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తొలిసారి డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడిన వారికి డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్స, కౌన్సెలింగ్ అందించాలని, పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడంపై కూడా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

# ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

**న్యూఢిల్లీ, జూలై 24:**
నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో పరీక్షల నిర్వహణ వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో భారీ ప్రక్షాళన చేపడుతూ 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. వారిలో కొందరిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు**
వచ్చే నెల రోజుల్లో ఎన్టీఏ వ్యవస్థలో విస్తృత మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడం, ప్రశ్నాపత్రాల లీకేజీకి ఆస్కారం లేకుండా పటిష్ఠ వ్యవస్థను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

**అవుట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు**
ఎన్టీఏ అమలు చేస్తున్న అవుట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రశ్నాపత్రాల తయారీ, భద్రత, రవాణా, పంపిణీ ప్రక్రియలను మరింత కట్టుదిట్టం చేసే కొత్త విధానాలను అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో పేపర్ లీక్‌లకు అవకాశం లేకుండా సాంకేతిక, పరిపాలనా పరమైన భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయనున్నారు.

**నిపుణుల కమిటీతో సమీక్ష**
ఎన్టీఏ పనితీరును సమగ్రంగా సమీక్షించి, సంస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్టీఏ నీట్, జేఈఈ, సీయూఈటీతో పాటు 20కిపైగా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈ సంస్కరణలు దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ విధానంపై కీలక ప్రభావం చూపనున్నాయని విద్యారంగ వర్గాలు భావిస్తున్నాయి.

# వెయ్యి కోట్ల సైబర్ మోసంపై సిట్

**హైదరాబాద్, జూలై 24:**
ఖమ్మం జిల్లాలో వెలుగుచూసిన వెయ్యి కోట్ల రూపాయల ఫైబర్ చీటింగ్, సైబర్ మోసాల కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భారీ మోసంపై దర్యాప్తు బాధ్యతలను సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అప్పగించగా, డీఎస్పీ కె.వి. మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని బృందం విచారణను చేపట్టింది.

**రెండు కీలక కేసులు సిట్ ఆధీనంలోకి**
ఖమ్మం జిల్లా పరిధిలోని వి.ఎం. బంజారా, సత్తుపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ కేసుల ఆధారంగా కొత్తగా కేసు నమోదు చేసి విస్తృత దర్యాప్తు ప్రారంభించింది. ప్రతి వారం విచారణ పురోగతిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని డీజీపీ ఆదేశించినట్లు సమాచారం. విదేశీ సంబంధాలు, అంతర్రాష్ట్ర మనీలాండరింగ్, బ్యాంకు లావాదేవీల కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

**నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్న మోసం**
ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో నిరుద్యోగులు, అమాయకులను నమ్మించి నిందితులు భారీ మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల పేర్లపై వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, వాటి ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల ద్వారా సమకూరిన రూ.1,000 కోట్లకు పైగా నిధులను ఈ ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు.

**నిందితుల నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా**
ఈ కేసులో పోత్రు ప్రవీణ్ ప్రధాన నిందితుడిగా గుర్తించిన అధికారులు, పోత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవరావు, జన్జునూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ తదితరులను కూడా నిందితులుగా చేర్చారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులకు సహకరించిన వ్యక్తులు, బోగస్ కంపెనీలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్ పాత్రపైనా సిట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ఈ భారీ సైబర్ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**హైదరాబాద్, జూలై 24:**
నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకాన క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను



నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరో**
ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పూర్తి అధ్యయనంతో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ బ్యూరో సంస్థాగత నిర్మాణం చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఎంసీహెచఆర్‌డీలో డీజీపీ, సీఎస్‌లతో కలిసి ఆయన శుక్రవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని, ట్రాఫిక్ విషయంలో నిబంధనల కంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. వాతావరణ మార్పులు, పనివేళలు, రద్దీ సమయాల, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం చేయాలని సూచించారు.ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఔటర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకొచ్చేందుకు అవసరమైనచోట అండర్ పాస్, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాలన్నారు. సాధ్యమైనంత వరకు సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు ఉండేలా చూడాలన్నారు.

**మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై కీలక సూచనలు**
డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్ని బాధ్యులను చేయాలన్నారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని, విద్యాసంస్థలకు అధికారంతోపాటు బాధ్యతను అప్పగించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండన్నారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించాలని, తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలన్నారు.

**సీఎం తొలి ఏకాదశి శుభాకాంక్షలు**
రేపు (25వ తేదీ) తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢంలో వచ్చే ఏకాదశిని ఏడాదిలో వచ్చే పండుగలకు ఇదే మొదటి పండుగగా జరుపుకుంటారన్నారు. తొలి ఏకాదశి రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, సకల శుభాలు కలిగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రార్థించారు. ఇది రైతుల పండుగ అని అభివర్ణిస్తూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాతో రైతు కుటుంబాలన్నీ ఏకాదశి పండుగను ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

**ఆలేరు, జూలై 24:**
ఆలేరు నియోజకవర్గం, బొమ్మలరామారం మండలంలోని సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వున్నారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ లాగ్ బుక్‌ను చెక్ చేసి, రైతులకు రోజుకు ఎన్ని గంటల కరెంట్ సప్లై చేస్తున్నారనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిరోజూ రైతులకు అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, పొలాలకు సాగునీరు అందించింది. బొమ్మలరామారంలో చనిపోయిన బీఆర్ ఎస్ కార్యకర్తను పరామర్శించడానికి వస్తే.. ఇక్కడి మహిళలు రెండు రోజులకు ఒకసారే నల్లా నీళ్లు వస్తున్నాయని తమ బాధలు చెప్పుకుంటున్నారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాగా కేసీఆర్ గారు మిషన్ భగీరథ ద్వారా ఐదేళ్ల పాటు రాష్ట్రమంతా నీళ్లు ఇస్తే.. ఉన్న వ్యవస్థను నడపడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. మిషన్ భగీరథను సరిగ్గా నడిపితే ఆ పేరు బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ గారికి వస్తుందనే అక్కసుతోనే కావాలని నీళ్లు ఇవ్వడం లేదా. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, కామారెడ్డి, యాదాద్రి, నల్గొండ, మహబూబ్ నగర్.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్ళీ బిందెలు పట్టుకుని మహిళలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి కనబడుతోంది. మీరు తెస్తామన్న ఆనాటి రోజులు అంటే ఇవేనా? కరెంటు కోసం, ఎరువుల కోసం రైతులు ధర్నాలు చేయడం, తరుగు తీయడమేనా మీ మార్పు. రైతులు కరెంటు కోసం ఇబ్బంది పడుతున్నారని సోదరి సునీత గారు చెబితే ఈరోజు సోలేపేట సబ్‌స్టేషన్‌కు సర్ ప్రైజ్ విజిట్‌కి వచ్చాం. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ని అడిగితే.. మొన్నటి దాకా 1415 గంటలు ఇచ్చాం సార్, ఈ వారం నుంచి కేవలం 12 గంటలే ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి అని చెబుతున్నాడు. ప్రభుత్వం ఇస్తున్న ఆ 12 గంటల కరెంటులో కూడా రెండు మూడు సార్లు ట్రిప్ అవుతోంది. 24 గంటల కరెంటుకు రైతాంగాన్ని ఎందుకు దూరం చేస్తున్నారు? కరెంటుకు మేమే పేటెంట్ అని రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతున్నారు.. మీ పేటెంట్ అంటే ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేయడమేనా? నారుమళ్లు పోసుకునే, నాట్లు వేసుకునే ఈ కీలక సమయంలో నీళ్లు చాలా అవసరం. కరెంటు ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గం తిప్పర్తి మండలంలో, జగిత్యాల జిల్లా ఐలాపూర్, బాల్కొండ, కోహీర్ మండలం దిగ్వాల్, సిద్దిపేట జిల్లా కాజీపూర్, సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ సబ్‌స్టేషన్ల ముందు కేసీఆర్ 23,000 మెగావాట్ల విద్యుత్ స్థాపిత సామర్థ్యంతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో 15,000 మెగావాట్ల లోడు కూడా లేదు, ఎండాకాలం కూడా కాదు.. అయినా రైతులకు ఎందుకు కోతలు పెడుతున్నారు. కోతలు పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యమా. ఎన్నికల ముందు 4000 పెన్షన్, 15000 రైతుబంధు, మహిళలకు 2500, విద్యార్థి భరోసా అంటూ మాటల కోతలు కోశారు. ఇప్పుడేమో కరెంటు, బోనస్, కేసీఆర్ కిట్, గొర్రెలు, చేపల పంపిణీ, రైతు బీమాలలో కోతలు పెడుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మొన్న వరంగల్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంట్ కోతలే లేవని చెప్పారు. మరి ఈరోజు నేను సోలేపేట సబ్‌స్టేషన్ రికార్డులు చూస్తే 12 గంటల కరెంటే ఇస్తున్నారు.. భట్టి గారు దీనికి ఏం సమాధానం చెబుతారు. రాష్ట్రంలో 1011 గంటల కరెంటే వస్తోంది. మీ మాటలు గడప దాటుతున్నాయి కానీ మీ పనులు గడప దాటడం లేదు. మీరు నిజంగా కడుపు నిండా 24 గంటల కరెంటు ఇస్తే రైతులు ఎందుకు సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల, బొగ్గు నిల్వలు లేకపోవడం వల్ల కేసీఆర్ గారు నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 1600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు మూతపడి నెలలు గడుస్తోంది. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కూడా 270 మెగావాట్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. సింగరేణి మన చేతిలోనే ఉన్నప్పటికీ 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఎందుకు ఆగిపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతులకు ఫ్రీ కరెంటు ఇస్తే పైసలు రావని, కరెంటు ఉత్పత్తి ఆపేసి రైతులకు కోతలు పెడుతున్నారా? కరెంటు లేక కాదు.. రేవంత్ రెడ్డికి మనసు లేక కరెంటు రావడం లేదు. రైతులకు మూడు గంటల కరెంటు చాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారు, ఇప్పుడు ఆ మాటనే నిజం చేయదలుచుకున్నారా? హైదరాబాద్ ప్రజలకు ఎలాగైతే 24 గంటల కరెంటు వస్తుందో, బాయికాడ రైతుకు కూడా 24 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలన్నదే బీఆర్ఎస్ పాలసీ. బీఆర్ఎస్ ముల్లు గర్రతో పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం కదలడం లేదు. దేవాదుల మోటార్లు ఆన్ చేయాలని మేము ప్రశ్నిస్తే తప్ప, నిద్రలేచి 5 నుంచి 9 మోటార్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాం.. యాదాద్రి, భద్రాద్రిలో ఆగిపోయిన 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని వెంటనే ప్రారంభించి, రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి. కరువు పరిస్థితుల్లో బోర్లు అడుగంటిపోయినప్పుడు రైతులకు కరెంటు అవసరం చాలా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథపై వెంటనే రివ్యూ చేసి, ప్రతిరోజూ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. మండలంలో వ్యవసాయ అధికారిని అడిగితే ఒక్క బొమ్మలరామారం మండలంలోనే 10 రైతు బీమాలు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే వారం రోజుల్లో 5 లక్షలు ఇచ్చేలా కేసీఆర్ రైతు బీమా తెస్తే.. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 4000 మంది రైతులకు బీమా డబ్బులు ఐదు నెలలుగా రావడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టారు, యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ సగం ఎగ్గొట్టారు..

# జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నిలదీయండి

**మొదటిపేజీ తరువాయి**
రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు సీహెచ్. విఠల్, జె.సంగప్ప తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జెన్ జీ తరం పిల్లల్లారా.. బీఆర్ఎస్ అంటేనే పేపర్ లీకేజీలు, పశ్నాపత్రాలు అమ్ముకుని దోచుకున్నరు.. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలోనూ అదే జరిగింది. ఆ రెండు పార్టీలను నిలదీయండి అని పిలుపునిచ్చారు. నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ ధర్నా చౌక్‌నే ఎత్తేసిన బీఆర్ఎస్ నేతలు ఇయాల సిగ్గు లేకుండా అదే ధర్నా చౌక్‌లో నిరసన చేశారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ పేరుతో జరిగిన నిరసనలో కమ్యూనిస్టు, కమ్యూనల్ పార్టీలు చొరబడి హింసను సృష్టించడమే కాక పార్లమెంటుపై దాడికి యత్నించాయని మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశం.. అందరి కంటే ఎక్కువగా ప్రధాని మోదీ బాధపడుతున్నారని చెప్పారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని, సీబీఐ ఇప్పటికే 11మంది ఫ్యాకల్టీసహా 17 మందిని అరెస్టు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఆందోళనను అర్థం చేసుకున్నాం.. విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణ చెప్పారు.. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనలో పోలీసులు, జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులపై దాడులతో ఆందోళనకారులు అసభ్యంగా ప్రవర్తించారని, పోలీసుల తలలు పగిలినా ఫైరింగ్ చేయలేదని చెప్పారు. 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని, విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరి లాఠీఛా□ర్జి చేయాల్సి వచ్చిందని అన్నారు. పాకిస్తాన్ నుండి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని, అందుకే పాకిస్తాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. నీట్‌కు.. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి.. నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి అని సంజj పశ్నించారు. విపక్షాలు పార్లమెంటులో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేవని నిలదీశారు. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ పెదవి విప్పలేదని, కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న అకస్మాత్తుగా పీఎం ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర చేసిందని అన్నారు.. మోదీని దించి రాహుల్‌ను పీఎం చేయాలన్నదే వాళ్ల ఏకైక లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో 72 సార్లు పేపర్లు లీకైనయ్.. మరి ఆనాడు మన్మోహన్ సింగ్, విద్యాశాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయలేదు.. ఇక రాజస్తాన్, పంజాబ్, కేరళ, కర్నాటక, య□పీ, బెంగాల్‌లలో ప్రశ్న పత్రాలు లీక్ అయితే ఆయా బాధ్యులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. అశోక్ గెహ్లాట్ సీఎంగా ఉండగా 18సార్లు పేపర్లు లీక్ అయితే ఆనాడు రాహుల్ , ప్రియాంక ఏమన్నారో దేశమంతా చూసిందంటూ కాంగ్రెస్ చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారమా అని అడిగారు. తాను రాష్ట్రంలో గ్రూప్1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరే చూశారన్నారు. కాగా, కేటీఆర్‌కు 50వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ కనీసం పుట్టిన రోజున కూడా నిజాలు చెప్పలేదని ఎద్దేవా చేశారు. ట్విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జి చేయించిన ఘటన మర్చిపోగలమా అన్నారు.అపుడు ఎందుకు రాజీనామా చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. పేపర్ లీక్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సుద్దపూసను తలపిస్తున్నాయని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలోనే టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీకైందని, గ్రూప్1లో అక్రమాలు జరిగి నాలుగు లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు నాశనమైందని, మరి ఆనాడు మీరెందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. మొన్న 'నీట్'లో ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులందరినీ పిలిచి సన్మానం చేసినవ్.. వారిని అడుగు.. 'నీట' ఎట్లా జరిగిందో చెబుతారన్నారు. గ్లోబరీనా గురించి మాట్లాడుతున్న సీఎం ఆ నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదన్నారు. విద్యార్థులారా కుటిల రాజకీయ నేతల ట్రాప్‌లో పడకండి.. మెడికల్ కౌన్సెలింగ్‌కు సిద్ధం కండి అని పిలుపునిచ్చారు.

# ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతకుముందు మణుగూరు ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గనిలోకి వెళ్లి బొగ్గును స్వయంగా చేతిలోకి తీసుకుని దాని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారని ఉప ముఖ్యమంత్రికి అధికారులు చెప్పారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ఆయన పరిశీలించి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్న బొగ్గు వివరాలను, భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు 4X270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీంతో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా సునిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు శుద్ధీకరణను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేకపోయిందని ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. సింగరేణి అనేది ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు.. వేలాదిమంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో చర్చలు ప్రారంభించాలని, సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్తు అవసరాలు, ఉత్పత్తి లక్ష్యాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ ను కూడా సింగరేణికే కేటాయించేలా ప్రభుత్వం చొరవ చూపాలని అధికారులు ఉప ముఖ్యమంత్రికి కోరారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే పదేళ్ల రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరి టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

**హైదరాబాద్, జూలై 24:**

పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే తెలంగాణ పోలీసులు సాంకేతికతలో ఎప్పటికప్పుడు ముందుండాలని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించేలా అన్ని పోలీసు యూనిట్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, సైబర్ సెక్యూరిటీ, ఈజీరో ఎఫ్ఐఆర్ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన మంత్రి ప్రగతి వేదిక ద్వారా దేశవ్యాప్తంగా కీలక ప్రాజెక్టులు, పాలనకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాలు, ముఖ్యంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ రాష్ట్రాల సైబర్ భద్రత పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తోందని డీజీపీ తెలిపారు. మొత్తం తొమ్మిది కీలక పనితీరు సూచికల ఆధారంగా రాష్ట్రాలకు జాతీయ ర్యాంకులు కేటాయిస్తారని, ఆ అన్ని అంశాల్లో తెలంగాణ పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేసి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించాలని సూచించారు. రాష్ట్రంలో ఈజీరో ఎఫ్ఐఆర్ వ్యవస్థ అమలు ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉందని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి యూనిట్ ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ జాతీయ స్థాయిలో వెనుకబడిన విభాగాల్లో పనితీరును మరింత మెరుగుపరచాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్న డీజీపీ, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలతో పాటు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. సాంకేతిక ఆధారిత దర్యాప్తు విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తుతో పాటు సాధారణ పోలీసింగ్‌లో కూడా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ను పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయి శ్రీ తో పాటు రాష్ట్రంలోని వివిధ పోలీసు యూనిట్ల సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

**హైదరాబాద్,జూలై24:**

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి

**మొదటిపేజీ తరువాయి**

రంగారెడ్డి ఎత్తిపోతల పురోగతిపై శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను ఫ్రీఫ్లో(నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాక అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫొటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జత చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా ఆదేశించారు. ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, ఆ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా



ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని సమీక్ష సందర్భంగా అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.

**అన్నారం ర్యాఫ్ట్ ఫౌండేషన్‌లోనూ సాంకేతిక సమస్యల సంకేతాలు**

సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని అధికారులు తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయన్నారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందుంచాలని మంత్రి ఆదేశించారు.

**కనిపించే నీరు ఒక్కటే ప్రామాణికం కాదు**

ప్రస్తుత వర్షాకాలంలో పంపింగ్ కార్యకలాపాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నందుకే పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు స్పష్టం చేశారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాక బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం.. ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది.. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమీక్ష పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో ప్రస్తుతం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రాసెసింగ్ ముందుకు సాగడం లేదని అధికారులు వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

**హైదరాబాద్, జూలై24:**

బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్ధాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

# ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల మార్గదర్శకత్వంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,569 నూతన ఆరోగ్య ఉప కేంద్రాల (సబ్ సెంటర్లు) భవన నిర్మాణాలను చేపట్టనున్నారు. అంతేకాకుండా, సాధారణ వైద్య పరీక్షల కోసం గ్రామీణ ప్రజలు ఇకపై పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉచిత నిర్ధారణ (డయాగ్నోస్టిక్) సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలోనే వ్యాధులను త్వరగా గుర్తించి సత్వర చికిత్స అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అయ్యే వైద్య ఖర్చుల భారాన్ని ప్రభుత్వం గణనీయంగా తగ్గించనుంది. వైద్యాన్ని పేద ప్రజల హక్కుగా మారుస్తూ, పల్లెల్లో ఆరోగ్య రంగానికి ప్రజా ప్రభుత్వం కొత్త ఊపిరి పోస్తున్నది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా వైద్య సేవల అందుబాటు, నాణ్యత గణనీయంగా పెరగనున్నాయి.

# లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 24:**

హైదరాబాద్‌లోని లోతుకుంట భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టులో జరిగిన విచారణలో హైడ్రా అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా వ్యవహరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వైఖరిపైనా ప్రశ్నలు లేవనెత్తింది. హైడ్రా తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టులో హాజరై వాదనలు వినిపించారు.

**కోర్టు ఉత్తర్వులను ఎందుకు పాటించలేదు?**

విచారణ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు సంబంధించిన చట్టాలను పక్కనబెట్టి కేవలం హైడ్రా చట్టం ప్రకారమే వ్యవహరిస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడం హైడ్రాకు అలవాటుగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఒకే భూమికి సంబంధించిన మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం అసాధారణ పరిణామమని పేర్కొంది.

**ధిక్కరణపై తీవ్ర అభ్యంతరం**

కోర్టు ధిక్కరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించకుండా, అదే భూమిలోకి మళ్లీ వెళ్లడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని హైకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఒక ఫిర్యాదు ఆధారంగా న్యాయస్థానం ఆదేశాలను విస్మరించి భూమిలోకి ప్రవేశించడం ఎలా సమర్థనీయమవుతుందని అధికారులను ప్రశ్నించింది.

**కమిషనర్‌కు అఫిడవిట్ ఆదేశం**

ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గడువు కోరగా, హైకోర్టు అంగీకరించింది. అయితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా క్షమాపణలు తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. సీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు నీట్ పేపర్ల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరం మారుతున్నది, నవతరం మారుతున్నది అని కేంద్రం తెలుసుకోవాలి. శ్రీలంకలో ఈ యువతరం ఉరికించి ప్రభుత్వాలను పాతరేసింది. అలాంటి యువతరంతో పెట్టుకోవద్దని ఆయన హెచ్చరించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే విద్యార్థుల వద్దకు వెళ్లి ఇప్పటికే అనేకసార్లు చర్చలు చేసి సమస్యలు పరిష్కరించాల్సి ఉండే. ఈ యువతరం ఈ జనరేషన్ సిబిఐ, ఈడి, ఐటిలకు భయపడేది కాదు అని మోడీ తెలుసుకోవాలి.తెలంగాణ యువతతో పాటు దేశం యువత ఆగ్రహంతో ఉన్నారు. పొట్టు పొట్టు కోపంగా ఉన్నారు. నిన్ను నీ ప్రభుత్వాన్ని మెట్టు మెట్టు ఎక్కి తొక్కుతారు. ఈ విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. యువతరానికి ఏ రాజకీయ నాయకుడి అండ లేదు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో వేలాదిమంది తరలి వస్తున్నారు. యువతరం ఆందోళన ఆగ్రహం కేవలం పేపర్ లీక్ కి సంబంధించిందే కాదు. 12 ఏళ్లుగా కేంద్రం చేస్తున్న మోసాలు, ద్రోహాల పైన ఆగ్రహం.అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్న తీరుని యువతరం అర్థం చేసుకున్నది. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ 24 కోట్ల ఉద్యోగాలు ఇయ్యలేనందుకే యువతరం ఈరోజు బయటకు వచ్చింది. మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియా బీజేపీ ఇచ్చింది. విద్యార్థులు యువతరం కేంద్రం నుంచి జవాబుదారితనాన్ని అడుగుతున్నది.

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తప్పైందా అని యువతరం అడుగుతున్నది, నిలదీస్తున్నది. ఈరోజు చేపట్టిన నిరసనలో ఎలాంటి రాజకీయాలు లేవు. విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని చూడలేకనే ప్రజాప్రతినిధులుగా, నాయకులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటం చేసి తెలంగాణ సాధించిన ఉద్యమ పార్టీగా విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉండాలనుకున్నాం. పార్టీల జెండాలు, ఎజెండాలతో వారి ఉద్యమానికి కలుషితం చేయవద్దు. కానీ వారికి అండగా ఉండాల్సిన అవసరం ఉన్నది. విద్యార్థులు ఒక్కరే కాదు వారందరికీ మనమంతా అండగా ఉన్నామని చెప్పాల్సిన అవసరం ఉన్నది. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాష్టికాన్ని అణచివేతను చూస్తే ఎవరి మనసైనా కరగాల్సిందే. వాళ్ళు అడిగిన దాంట్లో అన్యాయం ఏమున్నది? వాళ్ళు అడిగింది కేవలం తమకు న్యాయం చేయమని తమ భవిష్యత్తును కాపాడమని. యువతరం ప్రధానమంత్రి కుర్చీ అడిగిందా? కేంద్రమంత్రి కుర్చీ అడిగిందా? నీట్ పరీక్షా పత్రం పేపర్ లీక్ తో పాటు విద్యారంగంలో సంస్కరణ రావాలని సోనమ్ వాంగ్‌చుక్ నిరసనకు కూర్చున్నారు. మీడియా మద్దతు లేకున్నా సోషల్ మీడియా తోనే జెన్ జీ యువతరం దేశం మొత్తాన్ని కదిలించింది. ఇదే తెలంగాణ గడ్డ నుంచి 50 ఏళ్ల కింద జీనా హై తో మర్నాసికో కదం కదం పర్ లడ్నాసికో అని ఒక యువకుడు పిలుపునిచ్చిండు. ఆ స్ఫూర్తితో తెలంగాణ యువత, దేశ యువత గట్టిగా కొట్లాడుతున్నది. దేశంలోని ఆడబిడ్డలను పోలీసులు తీవ్రంగా దాడి చేస్తున్నారు. కొట్టకూడని చోట కొడుతున్నారు. విద్యార్థులకు యువతకు సంఘీభవంగా రాజకీయాలతో సంబంధం లేకుండా మా పార్టీ సంఘీభావం తెలిపింది ఈరోజు. విద్యార్థులు కోరుతున్నట్లుగా ధర్మేంద్ర ప్రధాన్ ని రాజీనామా చేయించాలి. విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. విద్యార్థులపై చేసిన దాష్టీకానికి అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలి. దేశంలో కేంద్ర మంత్రుల కొడుకులు రేపులు చేస్తే వెంటనే బెయిల్ వస్తున్నాయి కానీ పేపర్ లీకుల పైన ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదు. ఏ దేశం కోసం? ఏ ధర్మం కోసం? పేపర్ లీకుల పైన సమాధానం చెప్పడం లేదు. భారతీయ జనతా పార్టీ నాయకులు చెప్పాలి. అడగవలసిన అవసరం ఉన్నది, నిలదీయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**మోదీ తప్పు చేశాడంటే రేవంత్‌కు ఎందుకు కోపం?**

హైదరాబాద్, ప్రజాతంత్ర, జూలై 24: మోడీ పైన నేను కొట్లాడితే రేవంత్ రెడ్డి అనే కేడీకి ఎందుకు కోపం వచ్చింది? మోడీ తప్పు చేసిండు అంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం? మోడీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్ ని ఎందుకు పంపించి నన్ను అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. రాహుల్ గాంధీ ఢిల్లీలో కొట్లాడితే కొడంగల్లో పోయి రేవంత్ రెడ్డి దాక్కున్నాడు. నల్లమల్ల పిల్లి పోయి కొడంగల్లో దాక్కున్నది. రేవంత్ రెడ్డి కూతురునో, మనవడినో ఢిల్లీలో పిల్లల్ని కొట్టినట్లు కొడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా? ఢిల్లీ దాకా వెళ్లి మీ నాయకుడితో కూర్చుండి నిరసించే ధైర్యం కూడా రేవంత్ రెడ్డికి లేదు. దేశమంతా నరేంద్ర మోడీని ధర్మేంద్ర ప్రధాన్ ని ప్రశ్నిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్, కేటీఆర్ ని విమర్శిస్తున్నాడు. మేము మాట్లాడుతుంటే మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. ఢిల్లీని వణికించి తెలంగాణ తెచ్చిన పార్టీ మాది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి గడగడలాడించి అయినా విద్యార్థుల వెంట నిలబడతాం. నీకు ఎలాగూ ఢిల్లీని ప్రశ్నించే ధైర్యం లేదు రేవంత్ రెడ్డి. మమ్మల్ని ఎందుకు ఆపుతున్నాడో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

## సంపాదకీయం



# బొద్దింకలను తేలికగా తీసుకోవద్దు

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగుబాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవరమైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

# రాజీనామా చేయాల్సిందే!

- విద్యాశాఖ మంత్రి వెంటనే దిగిపోవాలి
- విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి
- కేంద్రానికి సీజేపీ కీలక అల్టిమేటం
- రెండు డిమాండ్లకు ప్రభుత్వ అంగీకారం

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకుకు కేంద్రం బాధ్యత వహించడంతో పాటు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పట్టుబట్టింది. ఢిల్లీలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో శుక్రవారం సమావేశమైన సీజేపీ ప్రతినిధుల బృందం తమ 3 ప్రధాన డిమాండ్లను లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం మంత్రి రాజీనామా మినహా మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పింది. దాదాపు 2 గంటలపాటు జరిగిన ఈ చర్చల అనంతరం సీజేపీ జాతీయ అధికార ప్రతినిధులు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా మీడియాతో మాట్లాడారు. తమ 3 డిమాండ్లలో రెండింటికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వారు వెల్లడించారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్లను ఉపసంహరించడానికి అంగీకరించిందని తెలిపారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌పైనా సానుకూలంగా ఉందని చెప్పారు.



### రేపటి వరకు గడువు

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై రేపు మధ్యాహ్నం వరకు ప్రభుత్వం తమను సమయం కోరిందని సీజేపీ నేతలు స్పష్టం చేశారు. త్వరలోనే ఆయనను పదవి నుంచి తొలగిస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. నీట్ పేపర్ లీకు వ్యవహారంలో మంత్రి రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని మంత్రులకు తేల్చిచెప్పామన్నారు. ఒకవేళ తమ డిమాండ్ నెరవేరకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని, ధర్మేంద్ర ప్రధాన్ వైదొలిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని సీజేపీ నేతలు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# దోషులకు పదేళ్ల జైలు..పదికోట్ల జరిమానా

- చట్టంలో మార్పులకు కేంద్ర కేబినెట్ నిర్ణయం!

**న్యూఢిల్లీ,జులై 24:** పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.




# యువతను ఫాలో కావడం అవసరమే

### సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి
### కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన

**న్యూఢిల్లీ,జులై 24:** యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేపర్ లీక్ నిందితులకు కఠిన శిక్షలు విధించే ముసాయిదా చట్టంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ఈ సూచనలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుకు కేంద్రం ఆమోదం లభించినట్టు కూడా తెలుస్తోంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వారికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకూ జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించినట్టు తెలుస్తోంది.



# ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం

### ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం
### విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన
### కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి

**న్యూఢిల్లీ,జూలై24:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగు తున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై దిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో దిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.



# పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

### నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై24:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది.

# నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

### వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ.. సోమవారానికి వాయిదా
### రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

**న్యూఢిల్లీ,జూలై24:** లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

చరకలు



# ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం

**హైదరాబాద్ జూలై 24,**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఒకవైపు కుండపోత వర్షాలు, వరదలు ప్రజలను అతలాకుతలం చేస్తుండగా, మరోవైపు తీవ్ర ఉష్ణోగ్రతలు, అడవి కార్చిచ్చులు, కరువు పరిస్థితులు అనేక దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) శాస్త్రవేత్తలు భవిష్యత్తులో ఇటువంటి తీవ్ర వాతావరణ ఘటనలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. చైనా దక్షిణ తీరాన్ని నౌల్ (Noul) ఉష్ణమండల తుఫాను ముప్పు వెంటాడుతోంది. గ్వాంగ్‌డాంగ్, ఫుజియాన్ ప్రాంతాల్లో 500–600 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రైలు, ఫెర్రీ సేవలను నిలిపివేయడంతో పాటు తీరప్రాంత పర్యాటక కేంద్రాలను మూసివేశారు. ఉత్తర చైనాలో కూడా భారీ వర్షాలు, ఆకస్మిక వరదల ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. భారత్ – పాకిస్థాన్ – అఫ్గానిస్థాన్లా రీ వర్షాలు, వరదల కారణంగా ఈ మూడు దేశాల్లో కలిపి కనీసం 82 మంది మరణించారు. అస్సాంలో బ్రహ్మపుత్ర నది ఉప్పొంగడంతో లక్షలాది మంది ప్రభావితమయ్యారు. అనేక గ్రామాలు జలమయం కాగా వేలాది మంది సహాయక శిబిరాలకు తరలించబడ్డారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో కూడా వరదలు పంటలు, రహదారులు, మౌలిక వసతులను దెబ్బతీశాయ యూరప్రా న్స్, స్పెయిన్, ఇటలీ వంటి దేశాలు తీవ్ర వేడి గాలులు, అడవి కార్చిచ్చులతో అల్లాడుతున్నాయి. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫ్రాన్స్‌లో జూన్–జూలై వేడి తరంగాల కారణంగా సుమారు 5,764 అదనపు మరణాలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రైన్, డాన్యూబ్ వంటి ప్రధాన నదుల్లో నీటి మట్టం తగ్గి రవాణా, వ్యవసాయంపై ప్రభావం పడుతోంది. అమెరికాలో ఒకేసారి మూడు రకాల తీవ్ర వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. తూర్పు ప్రాంతాల్లో కెనడా అడవి మంటల పొగతో గాలి నాణ్యత దెబ్బతింది. టెక్సాస్‌లో వరదలు, పశ్చిమ రాష్ట్రాల్లో భారీ అడవి మంటలు కొనసాగుతున్నాయి.

**శాస్త్రవేత్తల హెచ్చరిక**

ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడం, సముద్ర జలాల వేడిమి అధికమవడం, వాతావరణ మార్పుల కారణంగా తుఫాన్లు, కుండపోత వర్షాలు, వరదలు, వేడి తరంగాలు, అడవి కార్చిచ్చులు మరింత తరచుగా, తీవ్రంగా సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంతో పాటు విపత్తు నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. .

# మందిపల్లి పాఠశాల వంట ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ

- **మధ్యాహ్న భోజన మెనూ పాటించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం.**

**ధన్వాడ మండలం, జులై,24 :**

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నిర్దేశిత మెనూను పాటించకపోవడంపై జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆ రోజు మెనూ ప్రకారం వెజిటేబుల్ కర్రీ, గుడ్డు, సాంబారు వడ్డించాల్సి ఉండగా, వంట ఏజెన్సీ నిర్వాహకులు కేవలం గుడ్డు, సాంబారు మాత్రమే తయారు చేసినట్లు గుర్తించారు. వెజిటేబుల్ కర్రీ ఎందుకు తయారు చేయలేదని నిర్వాహకులను ప్రశ్నించారు.విద్యార్థులకు అందించే ఆహారంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, వంట ఏజెన్సీ నిర్వాహకులకు వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను (హెచ్ఎం) ఆదేశించారు. అంతకు ముందు పాఠశాలలో 4 వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు చెబుతున్న గణితం పాఠ్యాంశాన్ని కలెక్టర్ పరిశీలించారు.విద్యార్థులతో,కూడికలు తీసివేతలను బోర్డుపై చేయించి వారి సామార్థ్యాన్ని గుర్తించి అభినందించారు.

**ఫ్రైడే డ్రై డేను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్**

ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. గ్రామంలోని పలు నివాసాలను సందర్శించి నీటి తొట్టెలు, కుండీలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా లేదా అని ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తొట్టెలు, కుండీల్లో ఎక్కువ రోజుల పాటు నీటిని నిల్వ ఉంచడం వల్ల దోమల లార్వా పెరిగి దోమల సంఖ్య అధికమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇళ్లలో, ఇంటి ఆవరణలో ఎక్కువకాలం నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

**పంచాయతీ కార్యాలయ రికార్డుల పరిశీలన**

మందిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయ రికార్డులు, జనన–మరణ ధ్రువపత్రాల నమోదులు, వివాహ రిజిస్ట్రేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్న నేపథ్యంలో కొత్త భవన నిర్మాణంపై సర్పంచ్, కార్యదర్శితో చర్చించారు.పంచాయతీకి ఇప్పటివరకు



ఎంత నిధులు వచ్చాయి, వాటిని ఏ పనులకు వినియోగించారు, ప్రస్తుతం ఎంత నిధులు అందుబాటులో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.16వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయా అని కార్యదర్శిని ప్రశ్నించగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.11 లక్షలు అందాయని, 16వ ఆర్థిక సంఘం నిధులు ఇంకా విడుదల కాలేదని కార్యదర్శి వివరించారు. అలాగే పంచాయతీకి ఉన్న ఆర్థిక వనరులు, ఆస్తి పన్ను, ఇతర ఆదాయ వనరులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పురోగతిపై బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 1,058 మంది ఓటర్లలో మరణించిన 26 మంది పేర్లను తొలగించినట్లు, అలాగే 15 డబుల్ ఓట్లను గుర్తించి తొలగించినట్లు బీఎల్‌వోలు తెలిపారు. వివాహం తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన 20 మంది మహిళల ఓట్లను కూడా తొలగించినట్లు వివరించారు.ఈ సందర్భంగా తొలగించిన మహిళలకు వారి మెట్టినింటి ప్రాంతంలో ఓటు నమోదు జరిగిందా లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. అందుకు బీఎల్‌వోలు, వారి ఎపిక్ నంబర్లను పరిశీలించిన తర్వాతే జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు, మరో రెండు రోజుల్లో గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సురేందర్ రెడ్డి, గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు.దీనిపై స్పందించిన కలెక్టర్, రోడ్డు సమస్యకు పరిష్కారం చూపేలా తహసీల్దార్‌ను ఆదేశించారు.అనంతరం ధన్వాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యాలయంలో ధరణి పెండింగ్ ఫైళ్లు, మీ సేవా దరఖాస్తులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా జరుగుతోందో, రోజుకు ఎన్ని రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారో తహసీల్దార్ సింధూజను అడిగి తెలుసుకున్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

**రోగులకు పండ్లు అందజేస్తున్న నాయకులు**

**ఆలేరు, జూలై 24 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలేరు పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు సేవా కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ టౌన్ యూత్ అధ్యక్షుడు పూల శ్రావణ్ ఆధ్వర్యంలో, ఎన్ఆర్ఐ (అమెరికా) దూడల వెంకట్ గౌడ్ సహకారంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



నాయకులు మాట్లాడుతూ కేటీఆర్ ప్రజాసేవకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే నాయకుడని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్ యాట శివతో పాటు యువజన నాయకులు బీజని మధు, పాకాల హరీష్, మోతె వెంకటేష్, జింకల భరత్, మంగ అరవింద్, మొగిలిపాక కృష్ణ, ఫయాజ్, ఎలుగల హరికృష్ణ, పల్లె మహేష్, ఎర్ర ప్రశాంత్, జల్లి చందు, సంగి నాగరాజు, ఎలుగ నరేష్, నవీన్, బాసాని ప్రశాంత్, బాలరాజు, శ్రీధర్, పూల కళ్యాణ్, టింకు, వినోద్, శివ, యాట శ్రీకాంత్, నవీన్, రాజు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో భారీ కార్డన్ అండ్ సెర్చ్

- **50 లీటర్ల అక్రమ మద్యం, 8 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం – రౌడీషీటర్లకు కౌన్సెలింగ్**

**ఆలేరు, జూలై 24 :**

యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని పోచమ్మవాడతో పాటు పలు ప్రాంతాల్లో గురువారం భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని యాదాద్రి డివిజన్ డీఎస్పీ పి శ్రీనివాస్ నాయుడు పర్యవేక్షించగా, ఆలేరు టౌన్ సీఐ యలాద్రి ఆధ్వర్యంలో 5 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, ఏఆర్ బలగాలు, ఎస్‌వోటీ (SOT), టెక్నికల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని ఇన్నర్, ఔటర్ కార్డన్ బృందాలుగా విభజించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో నాకాబందీలు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. ఇంటింటి తనిఖీలు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులను పరిశీలించారు. ఇద్దరు రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి ప్రవర్తనపై కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించారు. అలాగే 10 మంది అనుమానాస్పద వ్యక్తుల వివరాలను డిజిటల్ వెరిఫికేషన్ పరికరాల ద్వారా ధృవీకరించారు. తనిఖీల్లో 50 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు చెల్లుబాటు అయ్యే పత్రాలు లేని 8 ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.



అలాగే 31 ద్విచక్ర వాహనాలు, రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు మూడు చక్రాల వాహనాలను పత్రాల పరిశీలన కోసం తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ పి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సంఘవ్యతిరేక శక్తులపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించేందుకు ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు

# ఆలయ నిర్మాణ పనులను సందర్శన

**కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**



**కొడంగల్ మున్సిపల్,(మం)జులై,24**

కొడంగల్ మండలం లోని చిట్లపల్లి దర్గా మరియు అంగడిరైచుర్ లో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాల డెవలప్మెంట్ మరియు కొడంగల్ పట్టణం లోని శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను సందర్శించిన కడ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందరం ప్రశాంత్,పీసీసీ మెంబర్ యూసఫ్,తదితర కొడంగల్ నియోజకవర్గ గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామాల ప్రజలు, మహిళలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# మన ఇల్లు - మన ఆరోగ్యం" కార్యక్రమాన్ని అధికారులందరూ విధిగా పాటించాలి

**జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, జులై,24**

"మన ఇల్లు – మన ఆరోగ్యం" కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ నివాసాల్లో దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా పరిశుభ్రత చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పూల కుండీలు, నీటి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు.వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల లార్వా అభివృద్ధి చెంది, దోమల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.దోమల నివారణకు ప్రతి శుక్రవారం జిల్లా అధికారులందరూ తమ తమ నివాసాల్లో "మన ఇల్లు – మన ఆరోగ్యం" కార్యక్రమాన్ని విధిగా నిర్వహించి, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

# జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన ఇన్ స్పెక్టర్

**వికారాబాద్, జులై,24**



సంగారెడ్డి జిల్లా నుండి వికారాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీల నేడు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, IPS గారిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీల గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ,విధి నిర్వహణలో ఆదర్శవంతమైన సేవలు అందించాలని తెలిపారు.

# ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు




**కొడంగల్ మున్సిపల్, జులై,24**

తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను శుక్రవారం కొడంగల్ లో మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,యువకులు,కాలనీవాసులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి యువతరానికి కేటీఆర్ స్ఫూర్తి అని,రాబోయే రోజుల్లో కేటీఆర్ ను ముఖ్యమంత్రి గా చూడాలన్నదే కోరిక అన్నారు.

చురకలు

శనివారం 25.07.2026

## ఆలేరులో బీఆర్ఎస్ ధర్నా

### రెండు గంటలుగా ట్రాఫిక్ స్తంభింపు



**ఆలేరు, జూలై 24 :**

బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించారంటూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆలేరు బిఐ స్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దాదాపు రెండు గంటలుగా కొనసాగిన ఈ ఆందోళనతో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ప్రధాన రహదారిపై దీర్ఘకాలం ధర్నా కొనసాగుతున్నప్పటికీ ట్రాఫిక్‌ను పునరుద్ధరించడం, పరిస్థితిని నియంత్రించడంలో పోలీసుల చర్యలు కనిపించలేదని స్థానికులు విమర్శించారు. ప్రధాన రోడ్డుపై అనుమతులు లేకుండా ఆందోళన కొనసాగడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడిందని, పోలీసుల అలసత్వంతోనే ధర్నా ఇంతసేపు కొనసాగిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వెంటనే స్పందించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## ఉచిత ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తులు

**జగిత్యాల , జూలై 24 :**

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సుకు జూలై 25 నుంచి ఆగస్టు 14 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా డైరెక్టర్ డా. రవికుమార్ తెలిపారు. గ్రూప్స్, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, పోలీస్ నియామక పరీక్షలకు ఉపయోగపడే ఈ కోర్సుకు ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఎంపికైన వారి జాబితా ఆగస్టు 18న విడుదల చేసి, ఆగస్టు 25 నుంచి శిక్షణ ప్రారంభిస్తారు.

## మీ సేవ కేంద్రాలు ఇక డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్లు

**హైదరాబాద్, జూలై 24 :**

తెలంగాణ ప్రభుత్వం మీ సేవ, మెటా సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్ లుగా అభివృద్ధి చేస్తోంది. దీంతో చిన్న, మధ్యతరహా వ్యాపారాలు తక్కువ ఖర్చుతో ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ వేదికలపై డిజిటల్ ప్రకటనలు చేసుకునే అవకాశం లభించనుంది. హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణలో 150 మందికి పైగా మీ సేవ వీఎల్ ఈలకు డిజిటల్ మార్కెటింగ్, వాట్సాప్ బిజినెస్, ప్రకటనల రూపకల్పన, లక్ష్య వినియోగదారుల ఎంపికపై శిక్షణ ఇచ్చారు. ఇకపై కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, స్టార్టప్ లు, ఎంఎస్ ఎంఈలు తదితర వ్యాపారాలు సమీప మీ సేవ కేంద్రాల ద్వారా ప్రొఫెషనల్ డిజిటల్ ప్రచార సేవలు పొందవచ్చు. మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం చిన్న, గ్రామీణ వ్యాపారాలను డిజిటల్ మార్కెటింగ్ కు చేరువ చేయడంతో పాటు మీ సేవ నిర్వాహకులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పించి రాష్ట్ర డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు.

## యూనిఫాంల పంపిణీ నెలలో పూర్తి చేయాలి: సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 24**

రాష్ట్రంలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులందరికీ రెండు యూనిఫాంల చొప్పున నెలరోజుల్లోగా పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. యూనిఫాంల తయారీకి 26 వేల స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించామని, నాణ్యతపై రాజీ పడకుండా విద్యార్థుల నుంచే ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. అదే వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి 45 రోజులకు మండల స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు.

## టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత కోచింగ్ కు దరఖాస్తులు

**హైదరాబాద్, జూలై 24:**

తెలంగాణ బీసీ ఉపాధి నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణా కేంద్రం (TGBCESDTC) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 12 టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, పోలీస్ నియామక పరీక్షలకు 125 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్సు నిర్వహించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ అభ్యర్థుల నుంచి జూలై 25 నుంచి ఆగస్టు 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులై, నిర్దేశిత ఆదాయ పరిమితిలో ఉన్నవారు అర్హులు. ఎంపికైన వారి జాబితా ఆగస్టు 18న విడుదల చేసి, ఆగస్టు 25 నుంచి కోచింగ్ ప్రారంభిస్తారు. 75 శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు ఐదు నెలల పాటు నెలకు రూ.1,000 స్టైపెండ్ అందజేస్తారు. దరఖాస్తులు: www.tgbcstudycircle.cgg.gov.in.

## రైతులకు ప్రత్యామ్నాయ పంటల అవగాహన కార్యక్రమం...

### (ఏ డి ఏ) బి.వెంకటేశం కొడంగల్ డివిజన్



**దౌల్తాబాద్ మండలం, జులై,24**

ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రస్తుత వానాకాలంలో వర్షపాతం లోపించే అవకాశం ఉన్న నేపథ్యంలో దౌల్తాబాద్ మండలంలోని రైతులకు దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచి బత్తుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ప్రత్యామ్నాయ పంటల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కొడంగల్ డివిజన్ సహాయ సంచాలకులు బి వెంకటేశం రైతులకు ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, నీటిపారుదల వనరుల లభ్యత, బోర్ వెల్ నీటి పరిస్థితిపై సమగ్ర అవగాహన కల్పించారు. తగినంత నీటి వనరులు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే పంటల విత్తనాలు వేయాలని సూచించారు. ప్రస్తుతము దౌల్తాబాద్ మండలం 49% Defecit Rainfall ఉందని రైతులకు తెలియజేశారు.అదేవిధంగా ,తగినంత వర్షపాతం లేదా నీటిపారుదల సౌకర్యం అందుబాటులో లేని పరిస్థితుల్లో పంటలు విత్తకుండా ఉండాలని రైతులకు స్పష్టంగా సూచించారు. ఒకవేళ రైతులు తప్పనిసరిగా సాగు చేయాలనుకుంటే, తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.వాతావరణ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోడి వెంకట్ రెడ్డి, సావిత్రమ్మ ఆశప్ప తదితర రైతులు మండల వ్యవసాయ అధికారి జి. తులసి, ఏఈఓ లు వైష్ణవి, జ్యోతి, నిఖిల్, లోకేష్, వినోద్

## ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం 31న పట్టణ బంద్

- **అఖిలపక్ష కమిటీ కరపత్రం ఆవిష్కరణ: ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపు**

**ఆలేరు, జూలై 24 :**

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 31న ఆలేరు పట్టణ బంద్ స్థానిక బస్టాండ్ వద్ద భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలేరు అభివృద్ధికి అత్యంత కీలకమైన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేపట్టనున్న పట్టణ బంద్, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 31న జరిగే పట్టణ బంద్, ధర్నా కార్యక్రమంలో ఆలేరు ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, పత్రికా విలేకరులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని



రెవెన్యూ డివిజన్ సాధనకు మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం, కో-కన్వీనర్ ఎండీ సలీం, రాచకొండ జనార్ధన్, చెక్క వెంకటేష్, మామిడాల భిక్షపతి, కందుల మధు, బేతి కృష్ణహరి, కామటికార్ అశోక్, ఆడెపు బాలస్వామి, జంపాల శ్రీనివాస్, వడ్డేమాన్ నరేందర్, పేరపు రాములు, మొరిగాడి రమేష్, ఇక్కిరి శ్రీనివాస్, ఎండీ రఫీ, ఎండీ గౌస్, యూసుఫ్, శంకర్, చింతకింది రామానుజం, వీరస్వామి, మొరిగాడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య

**నారాయణపేట, జులై,24**



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... ప్రజల ప్రాణ భద్రత ప్రతి వాహనదారుడి బాధ్యత అని, ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆటోలో అనుమతించిన దానికంటే ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించరాదని, అధిక వేగంతో వాహనం నడపకూడదని, రాంగ్ రూట్‌లో వెళ్లడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.ప్రతి ఆటోకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వన్‌వే నిబంధనలు, వేగ పరిమితులను తప్పకుండా పాటించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులను తరలించే ఆటో డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులను ఆటో నుంచి బయటకు వేలాడే విధంగా కూర్చోబెట్టకూడదని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రయాణికులు ఎక్కే, దిగే సమయంలో రోడ్డుకు అడ్డంగా కాకుండా సురక్షితమైన ప్రదేశాల్లోనే ఆటోను ఆపాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, ఇతర వాహనదారులు మరియు పాదచారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఆటో డ్రైవర్ కీలక పాత్ర పోషించాలని, "సురక్షిత ప్రయాణం – సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## శిక్షణ కాలానికి సంబంధించిన ఈఎల్స్ మంజూరు చేయాలి

### టీఎస్ యూటీఎఫ్

**బొంరస్ పేట మండలం, జులై,24**



బొంరస్ పేట మండల విద్యాధికారి (ఎంఈఓ) హరిలాల్ ను కలిసి టీఎస్ యూటీఎఫ్ బొంరస్ పేట మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.20-05-2025 నుండి 24-05-2025 వరకు ఎస్సీఈఆర్టీ (SCERT), తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన నిప్పుణ్ భారత్ (NIPUN Bharat) శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 5 రోజుల Earned Leaves (ELs) మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన శిక్షణలకు హాజరైన ఉపాధ్యాయులకు అర్హత మేరకు ఈఎల్స్ మంజూరు చేయడం వారి హక్కు అని అన్నారు. శిక్షణల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఇప్పటివరకు ఈఎల్స్ మంజూరు కాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వెంటనే అర్హులైన ఉపాధ్యాయులందరికీ Earned Leaves మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు గౌరారం గోపాల్, జిల్లా కార్యదర్శి శివరాజ్, మండల ఉపాధ్యక్షులు

## దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**వలిగొండ జూలై 24**




యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ వలిగొండ కేంద్రంలో విద్యాసంస్థల బంద్

నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా, దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టిఏ (ఎన్ టి ఏ)ను రద్దు చేయాలని, ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని, దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈరోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. ఈ పిలుపులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను బంద్ చేసి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వెల్లంకి మహేష్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌టిఏను రద్దు చేసి పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువతపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఆ ఘటనలపై నిష్పాక్షికంగా,పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా దేశంలో విద్యా కేంద్రీకరణ విధానాలను వెంటనే వెనక్కి తీసుకొని, రాష్ట్రాల హక్కులను పరిరక్షించే ప్రజాస్వామ్య, సమాన విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, నీట్ పేపర్ లీకేజీ కారణంగా మనస్థాపానికి గురై మరణించినట్లు పేర్కొనబడుతున్న 20 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించడంతో పాటు, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు సాయి, నాయకులు బత్తిని మధు,కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగిళ్ల కార్తీక్,చంద్ర,వరికుప్పల ఉదయ్,భువనగిరి సాయి మరియు ఏఐవైఎఫ్ మండల నాయకులు కనకపోయిన నందు, ఏఐఎస్ఎఫ్ కోకన్వీనర్ కన్నబోయిన శివసాయి, తోట దుర్గాప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగును ఉద్యమంలా చేపట్టాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.

**నారాయణపేట, జులై,24**




జూలై 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలి.

ప్రతి విద్యార్థికి ఆగస్టు 30 నాటికి రెండు జతల పాఠశాల యూనిఫాంలు అందించాలి.నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి.

పాఠశాల యూనిఫాంల తయారీలో నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండరాదు.

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు విస్తృతంగా మళ్లించాలని, అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను నిర్ణీత గడువులో నాణ్యతతో అందించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ , సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ తో కలిసి పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ముఖ్యమైన అజెండా అని అన్నారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి రాష్ట్రంలో సుమారు 52 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి విత్తనం పూర్తైందని తెలిపారు.రాష్ట్రంలో మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తైందని, మిగిలిన భూముల్లో సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షోభ పరిస్థితులను అవకాశంగా మలుచుకుని భూములను బీడుగా వదిలిపెట్టకుండా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు.జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పంటల వైవిధ్యీకరణలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలను ప్రభుత్వం అభినందిస్తుందని, వారు అమలు చేసిన కార్యాచరణను ఇతర జిల్లాల్లో కూడా అమలు చేస్తామని తెలిపారు.కంది, పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, అలసందలు, పొద్దు తిరుగుడు, కూరగాయలు,చిరుధాన్యాలు వంటి పంటలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. ఇప్పటివరకు వరి సాగు జరగని సుమారు 38 లక్షల ఎకరాల్లో అధిక భాగాన్ని ప్రత్యామ్నాయ పంటల కిందకు తీసుకురావాలని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్నందున బోరు నీటిపై ఆధారపడిన వరి సాగును నిరుత్సాహపరచాలని ఆదేశించారు.ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. పాఠశాల యూనిఫాంల సరఫరా ప్రభుత్వానికి అత్యంత ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ, నిర్ణీత గడువులో ఈ ప్రక్రియ పూర్తికావాలని అన్నారు. వస్త్రాల సరఫరా, వస్త్రాల కటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా కుట్టు పనులు, యూనిఫాంల నాణ్యత తదితర ప్రతి దశను జిల్లా, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా యూనిఫాంలను విద్యార్థులకు అందించాలని సూచించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి 2 జత యూనిఫాం తప్పనిసరిగా అందించాలని తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లు కుట్టు పనులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, యూనిఫాంల వస్త్రాల కటింగ్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ,సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, దాదాపు 40 శాతం వర్షపాతం లోటు నమోదైందని, భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఈ పరిస్థితులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరు తడి పంటలు సాగు చేయవచ్చని తెలిపారు. జూలై 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు అన్ని రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ ఆయిల్ పామ్ తోటలు, డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.మండల, గ్రామ స్థాయిలో కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేసి రైతులకు వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం ఆగస్టులో కొంత వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు అది సరిపోదని, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వివరించారు.సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ, యూనిఫాం వస్త్రాలను మండల కేంద్రాలకు సరఫరా చేయనున్నట్లు, గత రెండేళ్ల మాదిరిగా కాకుండా పాఠశాలల వారీగా వస్త్రాల కటింగ్‌ను మండల స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ టైలర్లతో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల కొలతలకు అనుగుణంగా మహిళా టైలర్లు కుట్టు పనులు చేపట్టాలని సూచించారు. కుట్టు పనులు మండల హబ్‌లలో లేదా టైలర్ల ఇళ్ల వద్ద నిర్వహించవచ్చని, ప్రతి మండలంలో అందుబాటులో ఉన్న బటన్ హోల్, బటన్ ఫిక్సింగ్ యంత్రాలను వినియోగించి యూనిఫాంలను పూర్తిచేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.జిల్లా, మండల స్థాయిలో మహిళా టైలర్లతో కలిసి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించాలని సెర్ప్ సీఈవో సూచించారు. టిడ్కో, మఫత్‌లాల్ సంస్థల ద్వారా వస్త్రాల సరఫరాను రోజువారీగా పర్యవేక్షించాలని, సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే రాష్ట్ర స్థాయికి తెలియజేయాలని ఆదేశించారు. యూనిఫాంల నాణ్యతపై ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థుల నుంచి వాట్సాప్ లింక్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని, నాణ్యత సరిగా లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. కేజీబీవీ విద్యార్థులకు మొదటి జత యూనిఫాం దాదాపు పూర్తయిందని, రెండో జత పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పోర్టల్‌లో నమోదైన 26 వేల మంది మహిళా టైలర్లకు వెంటనే పనులు కేటాయించాలని, గత రెండు నుంచి మూడు నెలలుగా వారికి శిక్షణ ఇచ్చామని, అవసరమైతే స్థానికంగా అదనపు శిక్షణ కూడా అందించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పాఠశాల యూనిఫాంల కుట్టు పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. యూనిఫాంల వస్త్రాల సరఫరా, కటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టు పనులు, నాణ్యత పర్యవేక్షణ తదితర ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా, జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతు వేదికలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై ప్రచారం నిర్వహించి, రైతులు ఎక్కువ సంఖ్యలో వాటి సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీ ఆర్డీవో వెంకట్ రాములు, డీ ఈ ఓ గోవింద రాజులు, డీ ఎం అండ్ హెచ్ ఓ జయ చంద్రమోహన్, డీ సీ హెచ్ ఓ మల్లికార్జున్,గురుకులాల సమన్వయ కర్త నాగ మణిమాల, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామ నామ స్మరణతో మారుమ్రోగిన బాన్సువాడ

- రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి నివాసంలో సమర్థ సద్గురు దుబ్బాక మహారాజ్ దివ్య ప్రవచనం

**బాన్సువాడ, జూలై 23:**



బాన్సువాడ పట్టణంలోని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, మాజీ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి స్వగృహంలో సమర్థ సద్గురు దుబ్బాక మహారాజ్ దివ్య ప్రవచనం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వేలాది మంది భక్తులు రామనామ స్మరణలో మునిగిపోయి ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. సమర్థ సద్గురు దుబ్బాక మహారాజ్ బాన్సువాడకు విచ్చేయగా, పోచారం శ్రీనివాసరెడ్డి తనయుడు పోచారం భాస్కర్ రెడ్డి, ఆయన సతీమణి స్వామీజీకి ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమర్థ సద్గురు దుబ్బాక మహారాజ్ మాట్లాడుతూ, ప్రతి మనిషి తన జీవితంలో ప్రేమను పంచుతూ జీవించాలని, ప్రేమే మానవత్వానికి నిజమైన పునాది అని అన్నారు. ఈర్ష్య, ద్వేషం, అహంకారం వంటి చెడు భావాలకు మనసులో స్థానం ఇవ్వకూడదని, ఇతరుల పట్ల సానుభూతి, సేవాభావం, క్షమాగుణం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని, హనుమంతుని అనుగ్రహం కోసం ప్రతిరోజూ సమీపంలోని హనుమాన్ ఆలయాన్ని దర్శించి భక్తితో ప్రార్థనలు చేయాలని భక్తులకు సూచించారు. శ్రీరామ నామస్మరణ, హనుమంతుని భక్తి మనిషిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతతను పెంపొందిస్తాయని తెలిపారు. అలాగే తల్లి, తండ్రి, గురువును గౌరవించడం భారతీయ సంస్కృతికి మూలాధారమని పేర్కొంటూ, వారి ఆశీస్సులతోనే జీవితం సాఫల్యమవుతుందని అన్నారు. ధర్మాన్ని ఆచరిస్తూ కుటుంబ విలువలను కాపాడాలని, సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భక్తులు శ్రీరామ నామసంకీర్తనలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బాన్సువాడతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై సమర్థ సద్గురు దుబ్బాక మహారాజ్ దివ్య ప్రవచనాన్ని శ్రద్ధగా ఆలకించి ఆశీర్వాదాలు పొందారు.

# బ్యాంకుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి

**నారాయణపేట, జులై,24**




నారాయణపేట రూరల్: బ్యాంకులకు లావాదేవీల కోసం వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నారాయణపేట రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి సూచించారు.నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటకొండ గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, ప్రజలకు భద్రతా సూచనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ... బ్యాంకుల వద్ద నగదు లావాదేవీలు నిర్వహించే సమయంలో అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, డబ్బులు లెక్కపెట్టడం, బ్యాగులు మోయడం లేదా నగదు మార్చి ఇస్తామని చెప్పే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తున్న వారు వీలైతే కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తిని వెంట తీసుకెళ్లాలని, నగదును బహిరంగంగా ప్రదర్శించకుండా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు.బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు.ఇలాంటి మోసపూరిత కాల్స్, సందేశాలు లేదా లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే www.cybercrime.gov.in ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు.ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుంది అని అప్రమత్తతే మోసాల నివారణకు ఉత్తమ మార్గమని ఎస్సై పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణలో కో-ఆప్ బ్యాంక్ కాలనీ ఆదర్శం




**హైదరాబాద్, జూలై 24 :**

వర్షపు నీటి సంరక్షణలో నాగోల్‌లోని కో–ఆప్ బ్యాంక్ కాలనీ నగరానికే ఆదర్శంగా నిలుస్తోందని జలమండలి తెలిపింది. ఈ నేపథ్యంలో జలమండలి ఆధ్వర్యంలో కాలనీలో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. కాలనీలో సుమారు 80 శాతం ఇళ్లలో రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలమట్టం స్థిరంగా ఉండటంతో పాటు బోర్‌వెల్లలో నీటి లభ్యత పెరిగిందని అధికారులు వెల్లడించారు. కొత్త బోర్‌వెల్లను 60 మీటర్లకు మించి తవ్వకూడదనే నిర్ణయాన్ని కాలనీ వాసులు స్వచ్ఛందంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను కాపాడాలని, కో–ఆప్ బ్యాంక్ కాలనీని నగరంలోని ఇతర కాలనీలు ఆదర్శంగా తీసుకోవాలని జలమండలి అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, సీడ్ ఎన్‌జీఓ ప్రతినిధులు, కో–ఆప్ బ్యాంక్ కాలనీ ఆర్‌డబ్ల్యూఏ సభ్యులు పాల్గొన్నారు.

## రాఘవపూర్‌లో ఘనంగా వనమాహోత్సవం

**కామారెడ్డి:జూలై24**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీ ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు రాఘవపూర్ గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో 4,000 ఈత మొక్కలను నాటారు. ఇందులో కామారెడ్డి సొసైటీ నెం.1 గ్రూపు 2,000, సొసైటీ నెం.2 గ్రూపు మరో 2,000 మొక్కలను నాటింది. ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఈత, తాటి మొక్కలు పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికులకు జీవనోపాధిని కల్పిస్తాయని తెలిపారు. ఏపీవో అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రతి మొక్క సంరక్షణకు ప్రభుత్వం రూ.5 ప్రోత్సాహకం అందిస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కల పరిరక్షణ బాధ్యతను స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినీల నరేష్, ట్రైనింగ్ ఏఈఈఎస్ అరుణ్ చంద్ర, ఎక్సైజ్ సీఐలు సంపత్ కృష్ణ, సుందల్ సింగ్, ఎస్సైలు విక్రమ్ కుమార్, శ్రీనివాస్, రచన, పంచాయతీ కార్యదర్శి మాధవి లత, గౌడ సంఘం నాయకులు రామచందర్ గౌడ్, జీవన్ గౌడ్, చంద్ర గౌడ్, నారా గౌడ్, గోపి గౌడ్, శ్రీధర్ గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ జాన్, ఫరీద్, కానిస్టేబుళ్లు మునావర్ గోరి, పవన్, బాబు, శరత్, దినేష్, అమృత్ రెడ్డి, రాజు, శంకర్, వందన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పుల్కల్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృత పర్యటన

**సంగారెడ్డి, జూలై 24**



జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పుల్కల్ మండలంలో పర్యటించి బస్వాపూర్‌లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కేజీబీవీలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం, పారిశుధ్యం, భద్రత, ఆరోగ్య పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆరో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించి నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. లక్ష్యంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని విద్యార్థినులకు ప్రోత్సాహం ఇచ్చారు.

## అడ్డాకల్ లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటన

**మహబూబ్ నగర్, జూలై 24 :**



అడ్డాకల్ మండలంలోని పొన్నకల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా నాన్–కెడస్టల్ భూముల రీ–సర్వే పనులను పరిశీలించారు. పొన్నకల్–రాచాల గ్రామాల సరిహద్దు రీ–సర్వే ప్రక్రియను మ్యాప్ ద్వారా పరిశీలించి, రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. రీ–సర్వేను పారదర్శకంగా నిర్వహించి, సాంకేతిక సమస్యలు, ప్రజల సందేహాలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శిథిలావస్థలో ఉన్న కోనేరును పరిశీలించి పునర్నిర్మాణంపై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి, మీ సేవ తదితర పెండింగ్ దరఖాస్తులను సమీక్షించి, 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్, జూలై 24 :**

జిల్లాలో భూగర్భ జలాల పెంపు, సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పని సరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం అమలుపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ, వర్షపు నీటిని భూమిలోకి చేరేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఫామ్‌పాండ్లు, బోరుబావుల రీఛార్జ్ పిట్‌లు, వర్మీ కంపోస్ట్ యూనిట్లు, పర్కోలేషన్ ట్యాంకుల నిర్మాణ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల సంరక్షణకు అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి



**మణుగూరు, జూలై 24:**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, మణుగూరు ప్రకాశ్ ఖని (పీకే ఓసీ) ఓపెన్‌కాస్ట్ గనిని శుక్రవారం సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు తవ్వకాలు, భద్రతా ప్రమాణాలు, ఉత్పత్తి సామర్థ్యంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భద్రాద్రి పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఏ.వి. పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నెముకలాంటి సంస్థ అని పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని, రాబోయే బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొనాలని అధికారులను ఆదేశించారు. సంస్థ అభివృద్ధి, విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు: అదనపు కలెక్టర్



**జగిత్యాల, జూలై 24**

విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి గురుకుల బాలికల కళాశాలలో వంటశాల, భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి లక్ష్యంతో చదివి ఉన్నత విద్య సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్‌ను పరిశీలించి తాగునీటి నాణ్యత, సరఫరా వ్యవస్థపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ఏర్దండి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేపట్టారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ఉత్తర్వుల పంపిణీ



**అదిలాబాద్ జూలై24**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 6 నుంచి 16 వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు రశీదులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష కలిసి అందజేశారు. ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులే నివాసంగా వినియోగించుకోవాలని, అద్దెకు ఇవ్వడం లేదా విక్రయిస్తే విచారణ జరిపి కేటాయింపులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. లక్కీ డ్రా విధానంలో పారదర్శకంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రస్తుతం కేఆర్‌కే కాలనీ, మావల ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. త్వరలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అధికారిక ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు వెల్లడించారు.

# పని తీరు మెరుగు పరచుకోకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవు

**జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక.**

**నారాయణపేట, జులై,24**




జిల్లాలో మహిళా సంఘాల కార్యకలాపాలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) పనితీరు, నిధుల వినియోగం, ఎన్‌పీఏలు లేకుండా నిర్వహణ వంటి అన్ని అంశాల్లో నారాయణపేట జిల్లా రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అయితే ప్రస్తుతం జిల్లాలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరు మెరుగు పరచుకోకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రియాంక హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలో గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏపీఎంలు, సీసీ లు, ఎంఎంఎస్ ఓ బీ లు, జెడ్ ఎంఎస్ ఓ బీ లతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ( సోషల్ మొబైలైజేషన్) నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఏపీఎంలు, సీసీలతో ప్రతి సమావేశంలో సానుకూలంగా మాట్లాడినా, ఇంకా పనితీరులో గణనీయమైన మెరుగుదల కనిపించడం లేదన్నారు. జిల్లాలో ఐబీ కార్యకలాపాల పనితీరు రాష్ట్రంలో చివరి స్థానంలో ఉండడం ఆందోళనకరమని పేర్కొన్నారు.గ్రూపుల్లో చేరాల్సిన అర్హుల జాబితా ఉన్నప్పటికీ, కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. అలాగే వృద్ధుల నమోదు విషయంలో కూడా జిల్లా లక్ష్యానికి చాలా వెనుకబడి ఉందని తెలిపారు.ఒక వారంలోనే పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని, ఏపీఎంలు, సీసీలకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నట్లు చెప్పారు. ఇకపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రతి సమావేశంలో హెచ్చరికలు ఇవ్వాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. కొంతమందిలో "ఏళ్లుగా ఇదే విధంగా పనిచేస్తున్నాం, ఏం చేసినా ఇదే పరిస్థితి" అనే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. ఆ ధోరణిని వెంటనే మార్చుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పనితీరు మెరుగుపడకపోతే ఆ పదవిలో కొనసాగడం వల్ల జిల్లాకు ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఒక సీసీ ఉండటం వల్ల అదనంగా ఎన్ని సంఘాలు ఏర్పడ్డాయి, ఎంతమందిని సభ్యులుగా చేర్చారు, ఎంత నిధులు సమీకరించారు వంటి ఫలితాలు కనిపించాలని అన్నారు. ఒక కొత్త సంఘం ఏర్పాటు చేసిన తర్వాత శిక్షణలు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, ఇతర ప్రక్రియలు పూర్తి కావడానికి కనీసం ఆరు నెలల సమయం పడుతుందని, అందువల్ల ఈ పనులను గత ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్త ఆర్థిక సంవత్సరంలోకి వచ్చిన తర్వాత కూడా జిల్లా వెనుకబడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా పీడీ డీఆర్‌డీఏకు సూచనలు చేస్తూ, తాము మాత్రమే పనిచేయడం కాకుండా కిందిస్థాయి సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా డీపీఎంలు, ఏపీఎంలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోతే వారిపైనే ముందుగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇకపై జరిగే ప్రతి సమీక్ష సమావేశానికి పీడీ, డీపీఎం, ఏపీఎం ముగ్గురూ తప్పనిసరిగా హాజరు కావాలని, వారితోనే నేరుగా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి అధికారి తమ పనితీరు, సాధించిన లక్ష్యాలపై స్పష్టమైన వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.అదే విధంగా, ప్రస్తుత పనితీరులో మార్పు రాకపోతే కనీసం ఒక సీసీపై, అవసరమైతే ఏపీఎంలపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోనని స్పష్టం చేశారు.ఏపీఎంలు, సీసీలు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తాను జిల్లాకు వచ్చి రెండు నెలలు మాత్రమే అయినప్పటికీ జిల్లా పరిస్థితులపై పూర్తి అవగాహన ఏర్పడిందని, అయితే ఏళ్ల తరబడి పనిచేస్తున్న అధికారులు ఇంకా ఎందుకు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ, ఎన్‌పీఏల తగ్గింపు, సంస్థాగత నిర్మాణం (ఇన్‌స్టిట్యూషనల్ బిల్డింగ్) వంటి అన్ని కార్యకలాపాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి సీసీ పనితీరును ఎక్స్‌ఎల్ షీట్ రూపంలో నమోదు చేసి, ప్రస్తుత స్థితి, లక్ష్యాలు, సాధించిన పురోగతిని వివరాలతో సమర్పించాలని ఆదేశించారు. నేటి పనితీరు నివేదికను వెంటనే సమర్పించడంతో పాటు, మరో 15 రోజుల తర్వాత అదే నమూనాలో పురోగతి నివేదిక ఇవ్వాలని సూచించారు.జిల్లా అన్ని కీలక సూచికల్లో చివరి స్థానంలో ఉండటం ఆందోళనకరమని పేర్కొంటూ, ఇకపై ప్రతి అధికారి పనితీరు కంప్యూటరైజ్డ్ విధానంలో సమీక్షిస్తామని తెలిపారు. ఎవరు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారో క్షణాల్లో గుర్తించే విధంగా వ్యవస్థను రూపొందించాలని డీఆర్‌డీఏ ను ఆదేశించారు.పనితీరు సరిగా లేని అధికారులు, సిబ్బందిపై ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే వారికి బదులుగా ఇతర అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తామని స్పష్టం చేశారు. ఇకపై మండలాల వారీగా కారణాలు వినే పరిస్థితి ఉండదని, ఫలితాలే ప్రమాణంగా తీసుకుంటామని చెప్పారు. ప్రతి మండలంలో ఎన్‌పీఏలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, మహిళలు చేపట్టగలిగే ఆదాయోపాధి కార్యక్రమాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రోజు నిన్నటి కంటే మెరుగైన ఫలితాలు సాధించే దిశగా అధికారులు పనిచేయాలని, ఒకే స్థాయిలో ఉండిపోవడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తోందని, భవనాల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చోట ఇంకా మంజూరు చేయాల్సిన భవనాలను వెంటనే ఆమోదిస్తామని చెప్పారు. నిధుల కొరత లేదని, పనులు ఎంత త్వరగా పూర్తిచేసి బిల్లులు సమర్పిస్తే అంత త్వరగా తదుపరి విడత నిధులు విడుదల అవుతాయని వివరించారు. పనులు ఆలస్యం చేస్తే నిధుల విడుదల కూడా ఆలస్యమై, తదుపరి ఆర్థిక సంవత్సరానికి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణ పురోగతిని కూడా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ శాఖ, సర్పంచ్ లేదా ఇతర ఏజెన్సీ ఎవరు నిర్మించినా, చివరకు వాటిని వినియోగించేది మహిళా సంఘాలేనని, అందువల్ల భవనాలను త్వరగా పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధుల వినియోగంపై కూడా అవగాహన కల్పించాలని చెప్పారు. గతంలో నిధుల విడుదలలో ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి పెండింగ్ నిధుల సమస్యను పరిష్కరించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ భవనాలకు సంబంధించిన కొద్ది పనులు మినహా మిగిలిన వాటికి నిధులు విడుదలయ్యాయని, మిగిలిన వాటికి కూడా త్వరలోనే నిధులు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ విషయాలను క్షేత్రస్థాయిలో మహిళా సంఘాలు, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులకు వివరించి అపోహలను తొలగించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపడం సాధ్యమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీ ఆర్డీ ఏ వెంకట్ రాములు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి పాల్గొన్నారు.

# నీట్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- **డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దని హెచ్చరిక**

**ఆలేరు, జూలై 24 :**




నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలేరు మండలం కొలనుపాక చౌరస్తాలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల నరేష్ లు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలుమార్లు వివిధ నియామక, ప్రవేశ పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇటువంటి సంఘటనల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షకు విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి సిద్ధమవుతారని, అలాంటి పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోవడం వల్ల వారి శ్రమ వృథా అవుతోందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు చేపడుతున్న ఆందోళనలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై నిర్బంధ చర్యలకు దిగడం సరైన విధానం కాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా పారదర్శక పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి బాధ్యత, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు యాసారపు ప్రసాద్, పట్టణ కార్యదర్శి మొరిగాడి పృథ్వి, జిల్లా కమిటీ సభ్యుడు వడ్డెమాను విప్లవ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దెల సాయిగణేష్, సాధం శ్రీనాథ్, లతీఫ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**హైదరాబాద్, జూలై 24**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో విద్యార్థి నాయకుడు అత్తిలి సాయి ప్రియాన్ష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా కళాసిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏడు సబ్జెక్టుల ప్రశ్నా బ్యాంకులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## వీటీఏడీఏ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేములవాడ, జూలై 24**

వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, గుడి చెరువు సుందరీకరణ, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతం చేయాలని సూచించారు. గుడి చెరువు తుది దశ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అన్ని ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

# ఆసుపత్రి రోగులకు పండ్ల పంపిణీ

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా కోటగిరిలో సామాజిక సేవలు



**కోటగిరి,జూన్24 :**

:–భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో పార్టీ నాయకులు శుక్రవారం సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. మండల బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అహరహం శ్రమించే నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల సమస్యలపై ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నందున, కేటీఆర్ పిలుపు మేరకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా నిరాడంబరంగా ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు.నాయకుని ఆదేశాలను శిరసావహించి రోగులకు సేవా కార్యక్రమాలు అందించామని, కేటీఆర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, శంకర్ గౌడ్, నజీర్, సమీర్, ఏత్తొండ దేవేందర్, మోగులప్ప, కప్ప సంతోష్, చిన్న అరవింద్, గంగా ప్రసాద్ గౌడ్, మోరే గౌతమ్, గగన్, ఉమాకాంత్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు వేగవంతం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**జనగామ, జూలై 24:**




రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించిన "తెలంగాణ వ్యవసాయ అత్యవసర & ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక–వానాకాలం 2026" హ్యాండ్‌బుక్‌ను జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను మంత్రి అభినందించారు. జిల్లాలో 35 శాతం వర్షాభావం కారణంగా వరి, పత్తి సాగులో ఏర్పడిన 52,435 ఎకరాల లోటును ప్రత్యామ్నాయ పంటలతో భర్తీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న, కందులు, మినుములు, పెసర్లు, జొన్నలు, కూరగాయలు తదితర పంటల సాగును ప్రోత్సహిస్తూ ఆగస్టు 31 నాటికి మిగిలిన 45,569 ఎకరాల్లో విత్తనాలు వేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. గ్రామాల వారీగా విత్తనాల కేటాయింపు, ప్రతి ఏఈఓ క్లస్టర్‌కు లక్ష్యాలు నిర్దేశించి అమలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# మహిళల జూడోలో సీఐఎస్ఎఫ్‌కు రన్నరప్ ట్రోఫీ

**హైదరాబాద్, జూలై 24**

హైదరాబాద్‌లో జరుగుతున్న 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్–2026 తొలి రోజు మహిళల జూడో పోటీలు ముగిశాయి. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) అన్ని ఏడు బరువు విభాగాల్లో పతకాలు సాధించి, 2 రజత, 5 కాంస్య పతకాలతో రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) మహిళల జూడోలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. జూలై 23 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ చాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 36 కేంద్ర, రాష్ట్ర పోలీసు సంస్థలకు చెందిన సుమారు 1,600 మంది క్రీడాకారులు, అధికారులు పాల్గొంటున్నారు. జూడో, తైక్వాండో, వుషూ, కరాటే, పెంచక్ సిలాట్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. మహిళల జూడోలో అన్ని బరువు విభాగాల్లో పతకాలు సాధించడం ద్వారా మహిళా క్రీడాకారుల ప్రతిభను సీఐఎస్ఎఫ్ మరోసారి చాటుకుంది. పురుషుల జూడో పోటీలు జూలై 24న ముగియనున్నాయి. అనంతరం ఇతర విభాగాల పోటీలు జూలై 30 వరకు కొనసాగనున్నాయి.



# హోదా పెరిగినా... చిన్ననాటి స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు

**రాయపోల్, జూలై 24:**



కాలం గడిచింది... జీవితాలు మారాయి... బాధ్యతలు పెరిగాయి... కానీ చిన్ననాటి స్నేహం మాత్రం ఏమాత్రం మారలేదని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మరోసారి నిరూపించారు. తన చిన్ననాటి రూమ్‌మేట్, క్లాస్‌మేట్ నాగేశ్వర్‌రావును ఆప్యాయంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎదురెదురుగా కనిపించగానే ఇద్దరూ చిరునవ్వుతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. "ఏరా నాగేశ్వరా... ఎంతకాలం అయింది నిన్ను చూసి... ఎలా ఉన్నావు? ఇంట్లో అందరూ క్షేమమేనా? మనం కలిసి గడిపిన రోజులు ఇంకా నిన్న మొన్నటిలాగే గుర్తున్నాయి" అంటూ బక్కి వెంకటయ్య ఆప్యాయంగా పలకరించారు. అందుకు నాగేశ్వర్‌రావు కూడా ఆనందంతో స్పందిస్తూ, "నువ్వు ఎంత పెద్ద స్థాయికి వెళ్లినా అదే ఆప్యాయతతో పలకరించడం ఎంతో సంతోషంగా ఉంది" అని అన్నారు. ఇద్దరూ విద్యార్థి దశలో కలిసి చదువుకున్న రోజులు, ఒకే గదిలో గడిపిన మధుర క్షణాలు, చిన్న చిన్న అల్లర్లు, సరదా సంఘటనలు గుర్తు చేసుకుంటూ మనసారా నవ్వుకున్నారు. కాసేపు పాత జ్ఞాపకాలలో మునిగిపోయిన వారిని చూసిన వారంతా స్నేహానికి ఇదే నిజమైన నిర్వచనమని అభిప్రాయపడ్డారు. అనంతరం నాగేశ్వర్‌రావుకు శాలువా కప్పి సత్కరించిన బక్కి వెంకటయ్య, "మనుషులు ఎంత ఎత్తుకు ఎదిగినా మనతో కలిసి నడిచిన వారిని ఎప్పటికీ మరవకూడదు" అని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ కలయిక అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేయగా, హోదాలు మారినా హృదయాలు మారవని, నిజమైన స్నేహం కాలానికి అతీతమని మరోసారి చాటిచెప్పింది.

# ఖమ్మం తాగునీటి అవసరాలకు గోదావరి జలాలు



**ఖమ్మం, జూలై 24 :**

ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఖమ్మం జిల్లాలో తాగునీటి కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నుంచి సుమారు 1,500 క్యూసెక్కుల గోదావరి జలాలను ఏన్కూర్ రెగ్యులేటర్‌కు తరలించి, అక్కడి నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని లంకాసాగర్ వైపు, 500 క్యూసెక్కుల నీటిని వైరా రిజర్వాయర్, పరిసర చెరువులకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఏన్కూర్ కాలువ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన, జిల్లాలో ఏ గ్రామానికీ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

# ఫార్మ్ పాండ్లతో వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూలై 24 :**




రైతులు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఫార్మ్ పాండ్లను వినియోగించి వర్షపు నీటిని నిల్వ చేసుకుని పొడి పరిస్థితులను ఎదుర్కోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామంలో 128 ఎకరాల్లో చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలనే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమల ఆయిల్‌కెమ్ ఫ్యాక్టరీని అక్టోబర్ నాటికి ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ఫార్మ్ పాండ్ల వంటి నీటి సంరక్షణ పద్ధతులను పాటిస్తూ ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని రైతులకు పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో విద్యార్థులపై చర్యలకు నిరసనగా హైదరాబాద్‌లో BRSV భారీ ధర్నా




**హైదరాబాద్, జూలై 24**

ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా BRS విద్యార్థి విభాగం (BRSV) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో BRS వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఆల్వాల్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి మీదుగా ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వరకు కొనసాగింది. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సభలో మార్రి రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థుల స్వేచ్ఛను అణచివేసే చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. విద్యార్థుల భావప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ MBC చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నేతలు, విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# తాగునీటి సమస్యల నివారణకు ముందస్తు చర్యలు: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 24:**

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయడం, అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించడం, ఎల్ఎండీ నీటి నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించడం, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొత్తపల్లి–ఎలగందుల, బొమ్మకల్, అలుగునూరు, చింతకుంటతో పాటు జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు:

## కలెక్టర్ దివాకర్ టీఎస్



**ఖమ్మం, జూలై 24:**

: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్లాక్‌స్పాట్లలో భద్రతా పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రమాదాల కారణాలపై సమగ్ర అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ప్రతి నెల మూడవ శుక్రవారం రోడ్డు భద్రత సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఖమ్మం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో వీధి వ్యాపారాలకు రెడ్‌జోన్‌లు గుర్తించాలని, మున్సిపల్ ప్రాంతాల్లో శాస్త్రీయ పార్కింగ్ విధానం అమలు చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలను తొలగించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు క్యాష్‌లెస్ అత్యవసర వైద్య చికిత్స సదుపాయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

# రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పరిశీలన



**సిద్దిపేట, జూలై 24:**

,( సమయం న్యూస్ )కోహెడ మండలం తంగళ్లపల్లి శివారులో 23 ఎకరాల్లో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణ పురోగతిలో ఈ ప్రాజెక్టు అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. మై–వన్ టెక్నాలజీతో ఇటుకలు లేకుండా ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్న ఈ విద్యా సముదాయం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు.

## యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి

# ఆహార అలవాట్లు మీకు తెలుసా?



### యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం

### కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలం దెబ్బతినే అవకాశం

ప్రస్తుతం కాలంలో చాలా మంది యూరిక్ యాసిడ్ సమస్యతో ఇబ్బంది అనారోగ్యానికి గురవుతున్నారు. యూరిక్ యాసిడ్ అనేది మన రక్తంలో కనిపించే వ్యర్థ పదార్థం. శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు

మనం తీసుకునే ఆహారంలోని ప్యూరిన్స్ అనే పదార్థాల విచ్ఛిన్నంలో భాగంగా యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. రక్తంలోని యూరిక్ యాసిడ్ మూత్రం ద్వారా విసర్జితమవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తి పెరిగినా, విసర్జన సరిగా జరగకపోయినా అది రక్తంలోనే నిలిచిపోయి స్ఫటికాలుగా కీళ్లలోనూ, కీళ్ల చుట్టూ ఉండే కణజాలంలో చేరుతుంది. అప్పుడు కీలు వాచిపోయి, కదలికలు కష్టంగా మారతాయి. ఇది గౌట్‌కు దారితీస్తుంది. అధిక బరువు, వయసు పెరగడం, వంశపారంపర్యంగానూ యూరిక్ సమస్య ఎదురవుతుంది. యూరిక్ యాసిడ్ సమస్యను నిర్లక్ష్యం చేస్తే.. అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. యూరిక్ యాసిడ్ మోతాదు పెరుగుదల శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌ను సృష్టించి, అన్ని అవయవాలనూ ప్రభావితం చేస్తుంది. దీనికారణంగా గుండె, కాలేయం, గాల్ బ్లాడర్, మూత్రపిండాల పనితీరుపై ప్రభావం పడుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించడానికి కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి. అవేంటో ఈ స్టోరీలో చూసేద్దాం.



ఒక టీస్పూన్ ఆర్గానిక్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఒక గ్లాసు నీటిలో కలపండి. ఈ నీళ్లు రోజు తాగితే.. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ నేచురల్ క్లెన్సర్, డిటాక్సిఫైయర్‌లా పనిచేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో మాలిక్ యాసిడ్ ఉంటుంది, ఇది శరీరంలోని యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేయడానికి, తొలగించడానికి సహాయపడుతుంది. యాపిల్ పండ్లలోనూ మాలిక్ యాసిడ్ ఉంటుంది. రోజు ఒక యాపిల్ తిన్నా మేలు జరుగుతుంది.

ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజు కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి.



శరీరంలో అధికంగా పేరుకున్న నిమ్మరసాన్ని తొలగించడానికి రోజుకు కనీసం రెండుసార్లు నిమ్మరసం తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది, ఇది యూరిక్ యాసిడ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. మీ డైట్‌లో ఉసిరి, జామ, నారింజ వంటి విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకున్నా మేలు జరుగుతుంది.



**ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది.**



**యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది.**



రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది.



ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి





# ఆలూ పొట్టులో అధిక పోషకాలు



బంగాళదుంపలు ఇష్టపడని వారు ఉండరేమో. ఈ ఆలుగడ్డలతో రకరకాల వంటను చేసుకొని లాగించేస్తుంటారు. అయితే బంగాళదుంప కూర.. లేదంటే చిప్స్, ఇతర వంటకాలు చేసేటప్పుడు.. పొట్టును తీసి పక్కకు పడేస్తుంటాము. అయితే ఆలుగడ్డల పొట్టులోనే అధిక పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆలు తొక్కను తీసేస్తే చాలా పోషకాలు మిస్ అయిపోతామని నిపుణులు చెబుతన్నారు. తొక్కపై అంతా మట్టి, దుమ్ము ఉంటాయి కనుక పొట్టును తీసేయాల్సి వస్తుంది. అయితే వాస్తవానికి ఆలూను పొట్టుతో సహా తినాలి. పొట్టులో అనేక విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ముఖ్యంగా ఫైబర్ ఉంటుంది. పొట్టులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది హైబీపీని తగ్గిస్తుంది. నాడీ వ్యవస్థ పని తీరును మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది.

### యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలం

ఆలు పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతాయి. ఆర్థరైటిస్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. అధిక బరువు సమస్య నుంచి బయట పడతారు. మెరిసే చర్మం మీ సొంతం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచైనా ఆలుగడ్డ తొక్కతో వండుకోవడానికి ప్రయత్నించండి. లేదంటే విలువైన పోషకాలు మిస్సవుతారు.

# తల్లిదండ్రుల మనసు నొప్పించకండి..

### ఈ ప్రశ్నలు అడిగి విసిగించకండి



తల్లిదండ్రులు చిన్నప్పుడు మనల్ని ఎలాగైతే కంటికి రెప్పలా కాపాడుకుంటారో.. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను మనం కూడా అలాగే చూసుకోవాలి. అయితే ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది తల్లిదండ్రులను భారంగా భావిస్తున్నారు. ఒకవేళ వారి పేరిట ఆస్తిపాస్తులు ఉంటే తప్ప పట్టించుకోవడం లేదు. అయితే తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వారిని అనవసర ప్రశ్నలు అడిగి విసిగించొద్దంటున్నారు.




### నిర్ణయాలపై ప్రశ్నించొద్దు?

తల్లిదండ్రులు గతంలో తీసుకున్న నిర్ణయాల గురించి వారిని పదే పదే ప్రశ్నించొద్దు.. ఆ నిర్ణయాల గురించి వారిని గుచ్చి గుచ్చి అడగడం.. ఫలానా పని ఎందుకు చేశారని నిలదీయం వారిని హర్ట్ చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### పోల్చడమూ మంచిది కాదు..

మనం పిల్లల్ని ఇతర పిల్లలతో పోల్చడం కరెక్ట్ కాదు.. అలాగే వృద్ధులైన తల్లిదండ్రులను ఫలానా వాళ్లతో పోల్చి మీరు వాళ్లకంటే ఎక్కువ ఎందుకు సంపాదించలేదు? వారిలా ఆస్తులు ఎందుకు కూడబెట్టలేదు.. అని అడగడం కరెక్ట్ కాదంటున్నారు నిపుణులు. ప్రతి ఒక్కరూ ఏదైనా ఓ విషయంలో ఫెయిల్ అవుతూనే ఉంటారు. దీని గురించి మళ్ళీ ప్రస్తావించకూడదు. వారి ఎక్స్ లవ్, మాజీ ప్రేమ, పెళ్ళి వంటి అంశాలను వారిని అడిగి బాధపెట్టొద్దు.

### సంబంధాలు..

తల్లిదండ్రులు వారు ఎన్నో అనుభవాలని చూసే వచ్చారు. కానీ, వీటి గురించి ఆలోచించక చాలా మంది వారి సంబంధాల గురించి మాట్లాడతారు. వారి పర్సనల్స్, రొమాన్స్ గురించి మాట్లాడడం మంచిది కాదు. తల్లిదండ్రుల్ని ఎప్పుడైనా ఆర్థిక విషయాల గురించి ఆరా తీసి ఇబ్బంది పెడతారు కొంతమంది పిల్లలు. మీరు ఎంత డబ్బు సంపాదించారు? ఎవరికిస్తారు. వీలునామా రాశారా అంటూ ఆరాలు తీస్తారు. కానీ, ఇవి అంత మంచిది కాదు. వీని వారు ఇష్టముంటేనే చెప్పేలా చూసుకోండి.

# లక్ష్మణ్ హెడ్ కోచ్‌గా కొనసాగించాలి



## లక్ష్మణ్ జట్టును నడిపించిన తీరు అమోఘం

## డిమాండ్ చేస్తున్న ఇండియా ఫ్యాన్స్

జింబాబ్వే పర్యటనలో శుభారంభం చేసిన టీమిండియా.. తమ వరుస పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. పసికూన ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో సిరీస్‌ల్లో క్లీన్ స్వీప్ అయిన భారత్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. వరుసగా 7 మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించలేకపోయిన భారత్.. జింబాబ్వే పర్యటనలో ఊరట విజయాన్ని అందుకుంది.మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం హరారే వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు ఇదే తొలి విజయం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో టీమిండియా అదరగొట్టింది. బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ అద్వితీయమైన ప్రదర్శన కనబర్చగా.. బ్యాటింగ్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అయితే ఈ పర్యటనకు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండగా.. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. అతని సపోర్ట్ స్టాఫ్ కూడా టీమిండియాకు సేవలందిస్తుంది. గంభీర్‌తో పాటు అతని సపోర్ట్ స్టాఫ్‌కు ఈ పర్యటనను విశ్రాంతి కల్పించారు.వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో టీమిండియా తొలి విజయం సాధించడంతో ఆయననే హెడ్ కోచ్‌గా కొనసాగించాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. జింబాబ్వేతో మ్యాచ్‌లో భారత బౌలింగ్ బాగుందని, అనుభవం లేని బౌలర్లతో లక్ష్మణ్ జట్టును నడిపించిన తీరు అమోఘమని కొనియాడుతున్నారు. కనీసం టీ20 ఫార్మాట్‌లోనైనా లక్ష్మణ్‌ను కోచ్‌గా కొనసాగించాలని బీసీసీఐని కోరుతున్నారు. టీమ్ ప్లానింగ్ అద్భుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులే చేసింది. వెస్లీ మధెవెరే(34 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 39), తడివానషే మరుమాని(20 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 27 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్(2/18), ప్రిన్స్ యాదవ్(2/16) రెండేసి వికెట్లు తీయగా.. శివమ్ దూబే, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లకు 126 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ(19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50) విధ్వంసకర హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇషాన్ కిషన్(24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35), శ్రేయస్ అయ్యర్(24 బంతుల్లో 3 ఫోర్లతో 28 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజర్బానీ రెండు వికెట్లు తీయగా.. రిచర్డ్ నగర్వా ఒక వికెట్ పడగొట్టాడు.



# మళ్లీ ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్‌గా జో రూట్!

అంతర్జాతీయ క్రికెట్ నుంచి బెన్ స్టోక్స్ అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడంతో ఇంగ్లాండ్ టెస్టు జట్టుకు కొత్త కెప్టెన్ ఎంపిక అనివార్యమైంది. ఈ సమయంలో టెస్ట్ జట్టు డిప్యూటీగా, వన్డే, టీ20 జట్టు కెప్టెన్‌గా ఉన్న హ్యారీ బ్రూక్ వైపే ఈసీబీ మొగ్గుచూపుతుందని అంతా భావించారు. అతడికే టెస్ట్ కెప్టెన్సీ ఇస్తుందని అంచనా వేశారు. కానీ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు అందుకు సిద్ధంగా లేదని సమాచారం. సీనియర్ ప్లేయర్ జో రూట్‌కు టెస్ట్ కెప్టెన్సీ అప్పగించాలని ఈసీబీ భావిస్తోందట.వచ్చే ఏడాది స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ వరకు జో రూటే ఇంగ్లాండ్ టెస్ట్ జట్టును నడిపించే అవకాశం ఉందని 'ది అథ్లెటిక్' నివేదించింది. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్ నుంచి రూట్ కెప్టెన్సీ ప్రయాణం మళ్లీ మొదలుకానున్నట్లు సమాచారం. ఇంగ్లాండ్ వైట్ బాల్ జట్ల కెప్టెన్‌గా ఉన్న హ్యారీ బ్రూక్ రాబోయే వన్డే ప్రపంచకప్ కోసం దృష్టి పెట్టాలని బోర్డు భావిస్తోంది. దీంతో టెస్టు జట్టు బాధ్యతలను అనుభవజ్ఞుడైన జో రూట్‌కే అప్పగించాలని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు నిర్ణయానికి వచ్చిందట. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టెస్టు సిరీస్‌లో ఎదురైన ఓటమి తర్వాత ఇంగ్లాండ్ మేనేజ్‌మెంట్ జట్టులో పలు మార్పులు చేస్తోంది. ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్‌ను టెస్టు కోచ్ నుంచి తప్పుకున్నాడు. టెస్ట్ జట్టు తాత్కాలిక కోచ్‌గా మార్కస్ ట్రెస్కోథిక్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కాగా జో రూట్ గతంలోనూ ఇంగ్లాండ్ కెప్టెన్‌గా ఉన్నాడు. 2017 నుంచి 2022 వరకు ఇంగ్లాండ్ జట్టును నడిపించాడు. మొత్తం 64 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 27 విజయాలను అందించాడు. అయితే 2022లో ఆ జట్టు ఆడిన 17 టెస్టుల్లో కేవలం ఒకే ఒక్క విజయం సాధించడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొని రూట్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అయితే ప్రస్తుత క్లిష్ట సమయంలో జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడానికి ఇంగ్లాండ్ జట్టులో కెప్టెన్సీకి రూట్ కంటే మెరుగైన ప్రత్యామ్నాయం మరొకటి లేదని బోర్డు భావిస్తోందట.

# మయాంక్ ప్రదర్శనతోనే విజయం

## టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



మయాంక్ యాదవ్ అద్వితీయమైన బౌలింగ్ ప్రదర్శనతోనే జింబాబ్వేతో తొలి టీ20లో విజయం సాధించామని టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మయాంక్ అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో విజయానికి ప్లాట్‌ఫామ్ సెట్ చేశాడని, ఆ తర్వాత వైభవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో పనిని పూర్తి చేశాడని పేర్కొన్నాడు. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా హరారే వేదికగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. కెప్టెన్‌గా తొలి విజయం సాధించడం సంతోషంగా ఉందని చెప్పాడు. 'కెప్టెన్‌గా తొలి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకంటే ఆనందమైన విషయం మరొకటి లేదు. మా ఆటగాళ్లు ప్రణాళికలను అమలు చేసిన తీరు చాలా బాగుంది. ముందే చెప్పినట్లుగా పిచ్‌లో బౌన్స్ ఉంది. ముఖ్యంగా హార్డ్ లెంగ్త్ నుంచి మంచి బౌన్స్ లభించింది. మ్యాచ్ ప్రారంభంలో బౌన్స్‌లో వైవిధ్యం కూడా కనిపించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పిచ్ తీరు దాదాపు ఒకేలా ఉంది. కానీ మయాంక్ యాదవ్ మాకు అద్భుతమైన ఆరంభాన్ని అందించాడు. అతను తన లెంగ్త్‌ను నియంత్రిస్తూ.. ప్రత్యర్థి బ్యాటర్లకు పరుగులు తీసే అవకాశం ఇవ్వకుండా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఆ తర్వాత పవర్ ప్లేలో వైభవ్ సూర్యవంశీ వచ్చి మాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. జింబాబ్వేను ఆలౌట్ చేయాలని అనుకోలేదు. ఏ జట్టులోనైనా సరే.. ఇన్నింగ్స్‌ను చివరి వరకు తీసుకెళ్లి గౌరవప్రదమైన స్కోర్ అందించే బ్యాటర్ ఒకరు ఉంటారు. వాళ్లు పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకొని, భాగస్వామ్యాలు నెలకొల్పడం ప్రారంభించారు. నేను మాత్రం బౌలర్లందర్నీ రొటేట్ చేశాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడాలని భావించాను.వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. అతను ఫియర్‌లెస్ యంగ్ బ్యాటర్. అతను ఆడిన విధానం అసాధారణం. అతనికి ఇక్కడ ఆడిన అనుభవం ఉంది. ఇక్కడి పిచ్‌లపై మంచి అవగాహన ఉంది. అండర్ 19 ఫైనల్లో అతను 175 పరుగులు చేశాడనుకుంటా. అందుకే మైదానంలోకి అడుగుపెట్టగానే అతనిలో అపారమైన ఆత్మవిశ్వాసం కనిపించింది. అతని బ్యాటింగ్ చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ సిరీస్‌కి ఇది చాలా మంచి ఆరంభం.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.



# ఏషియన్ గేమ్స్ క్వార్టర్స్‌కు భారత జట్లు

జపాన్‌లో సెప్టెంబరు 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఏషియన్ గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ రౌండ్?కు అర్హత సాధించాయి. ఈ పోటీల్లో క్రికెట్ మ్యాచ్‌లను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. 2023లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్‌లుగా ఈ ఈవెంట్‌లో బరిలోకి దిగబోతున్నాయి. పురుషుల విభాగంలో భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక టాప్ సీడ్ జట్లుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పురుషుల విభాగంలో మిగిలిన 4 క్వార్టర్ ఫైనల్స్ బెర్తుల కోసం మొత్తంగా 6 జట్లు పోటీ పడుతున్నాయి. గ్రూప్-ఏలో అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బీలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ ఉన్నాయి. ప్రతి గ్రూప్‌లో తొలి 2 స్థానాల్లో నిలిచిన జట్లు టాప్-8కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబర్ 28న భారత్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. అక్టోబర్ 1న సెమీ ఫైనల్స్, 3న కాంస్య పతక మ్యాచ్ జరగనుంది. ఇక అదే రోజు గోల్డ్ మెడల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. మరోవైపు మహిళల విభాగంలో 8 జట్లకు డైరెక్ట్ నాకౌట్ విధానంలో సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు మ్యాచ్‌లు జరుగుతాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌తో భారత్, బంగ్లాదేశ్‌తో చైనా, శ్రీలంకతో మలేషియా, పాకిస్థాన్‌తో థాయ్‌లాండ్ తలపడనున్నాయి.

### ఏషియన్ గేమ్స్‌కు భారత పురుషుల జట్టు..

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, జస్‌ప్రీత్ బుమ్రా, సంజు శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్షదీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, వైభవ్ సూర్యవంశీ

### ఏషియన్ గేమ్స్‌కు భారత మహిళల జట్టు:

హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి. కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, నందిని శర్మ, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్



# భారత్‌కు తొలి పతకం!

## బ్రాంజ్ నెగ్గిన ఝుండు కుమార్

## పారా పవర్ లిఫ్టింగ్‌లో కాంస్యం

## హెవీవెయిట్ విభాగంలో సత్తా

## రెండో ప్రయత్నంలో 190 కిలోలు

**న్యూఢిల్లీ :**మెన్స్ హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్ విభాగంలో భారత వీరుడు ఝుండు కుమార్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. తన అద్భుతమైన ప్రతిభతో భారత్‌కు తొలి కాంస్య పతకాన్ని అందించాడు. పతకాల వేటలో బోణీ కొట్టిన ఝుండు కుమార్ విజయంతో భారత క్రీడా బృందంలో సరికొత్త ఉత్సాహం వెల్లివిరిసింది. భారత అథ్లెట్లు పతకాల వేటను ఘనంగా ప్రారంభించారు. పారా పవర్ లిఫ్టింగ్ మెన్స్ హెవీవెయిట్ విభాగంలో బరిలోకి దిగిన ఝుండు కుమార్ కాంస్య పతకంతో సత్తా చాటాడు. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అతడు ఏకంగా 130.9 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు.

### 190 కిలోలు

ఈ పోరులో భాగంగా 2 వ ప్రయత్నంలో ఝుండు కుమార్ 190 కిలోల బరువును అలవోకగా ఎత్తాడు. తన బలమైన ప్రదర్శనతో పతకాన్ని లాంఛనంగా ఖాయం చేసుకున్నాడు. ఈ కాంస్య పతకంతో భారత్ పతకాల ఖాతా విజయవంతంగా తెరిచింది. భారత బృందం ముందుముందు మరిన్ని పతకాలు సాధిస్తుందని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.



# ఫిడే అధ్యక్షుడిగా ఆనంద్!

## భారత చెస్ రంగానికి గర్వకారణం

## చెస్ సమాఖ్య బాధ్యతల స్వీకరణ

## క్రీడాభిమానుల్లో ఉత్సాహం



**చెన్నై :**అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తాత్కాలిక అధ్యక్షుడిగా భారత చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ బాధ్యతలు స్వీకరించి సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత దేశానికి చెందిన ఒక క్రీడాకారుడు ఫిడే అత్యున్నత పీఠాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు ఫిడే ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆయన, తాజా పరిణామాల నేపథ్యంలో ఏకంగా తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రపంచ చెస్ క్రీడను శాసించే ఫిడే సంస్థకు తాత్కాలిక అధ్యక్షుడిగా ఆనంద్ ఎంపిక కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 5 సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఆనంద్, తన సుదీర్ఘ అనుభవంతో అంతర్జాతీయ చెస్ రంగానికి విశేషమైన సేవలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే సంస్థ పాలకవర్గం ఆయనకు ఏకగ్రీవంగా ఈ అత్యున్నత బాధ్యతలు అప్పగించింది.

### అరుదైన గౌరవం

చదరంగం పుట్టినిల్లు అయిన భారత దేశానికి చెందిన దిగ్గజ ఆటగాడికి ఈ పదవి దక్కడం నిజంగా అరుదైన గౌరవం అని క్రీడా పండితులు విశ్లేషిస్తున్నారు. 2022 నుంచి ఫిడే ఉప అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆనంద్, ప్రపంచవ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ముఖ్యంగా యువ క్రీడాకారులను ప్రోత్సహించడంలో, చదరంగం క్రీడను మారుమూల దేశాలకు సైతం తీసుకెళ్లడంలో ఆయన ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారు.

### దేశానికి గర్వకారణమైన ఘట్టం

ఫిడే అధ్యక్షుడిగా ఆనంద్ బాధ్యతలు స్వీకరించడం భారత చెస్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది. ప్రపంచవ్యాప్తంగా చదరంగం విస్తరణకు ఆనంద్ మార్గదర్శకత్వం, దార్శనికత ఎంతగానో ఉపయోగపడుతుందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. ఆనంద్ నియామకంతో భారత క్రీడాభిమానుల్లో అంతులేని ఉత్సాహం నెలకొంది. చెస్ దిగ్గజం సాధించిన ఈ ఘనత పట్ల దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, క్రీడాకారులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

# డిఫరెంట్ ప్రేమకథ.. చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం 'చెన్నై లవ్‌స్టోరీ' ఫస్ట్ గ్లింప్స్ నుంచే సినిమాపై ఆసక్తిని పెంచించింది. తొలిప్రేమ గురించి చెప్పే సంభాషణలు ఉత్సాహాన్ని పెంచాయి. 'కలర్ ఫోటో', 'బేబీ' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ ఇవ్వడం, ఈ సినిమా క్లాసిక్ అవుతుందనే కోణంలో చేసిన ప్రచారం? ఇవన్నీ సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రేమించిన వ్యక్తి పెళ్లి మండపంలోనే మోసం చేయడంతో నివి (శ్రీ గౌరీ ప్రియ) కుంగిపోతుంది. అలాంటి సమయంలో ఆమె జీవితంలోకి అడుగుపెట్టిన స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) మళ్లీ ప్రేమ, జీవితంపై ఆశలు చిగురించేలా చేస్తాడు. ఈ ఇద్దరి స్నేహం ప్రేమగా మారుతుంది. కానీ విధి ఈ ప్రేమకథను ఊహించని మలుపు తిప్పుతుంది. ఏమిటా మలుపు? ఈ కథకు ఎలాంటి ముగింపు దొరికిందన్నదే 'చెన్నై లవ్ స్టోరీ' కథ. ప్రేమకు ఫాంటసీ జోడించిన కథ ఇది. ప్రేమలో విఫలమై దేవదాసులా మారిన కథానాయిక కోణంలో కథను ప్రారంభించడం తొలి సగానికి కొత్తదనాన్ని తీసుకొచ్చింది. స్టీవెన్ శంకర్ నివి జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత ఇద్దరి మధ్య పెరిగే అనుబంధం, ప్రేమ సహజంగా ఆకట్టుకుంటాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది. ద్వితీయార్థంలో దర్శకుడు కథను పూర్తిగా ఫాంటసీ వైపు మళ్లిస్తాడు. అది ఇదివరకే వచ్చిన 'ఎందుకంటే? ప్రేమంట!' సినిమాను గుర్తు చేసినా, 'చెన్నై లవ్‌స్టోరీ' ఆత్మ వేరు. హీరో పాత్రలో వచ్చే జెలసీ కావాల్సిన వినోదాన్ని పంచుతుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషన్స్ హత్తుకునేలా ఉంటాయి. ప్రేమ విషయంలో రెండు పాత్రల మధ్య కాస్త గందరగోళం ఏర్పడినప్పటికీ, ఈ సినిమాకు దర్శకుడు ఇచ్చిన క్లైమాక్స్ హత్తుకునేలా ఉంటుంది. స్టీవెన్ శంకర్ పాత్రలో కిరణ్ అబ్బవరం చూపించే అమాయకత్వం, చలాకీతనం సహజంగా ఉంటాయి. చాలా ఎమోషన్ ఉన్న పాత్ర ఇది. దర్శకుడు కావాలనే తన కల, అలాగే నివితో ప్రేమ, తను అనాథ అనే భావం.. ఇవన్నీ సహజంగా పలికించాడు. నివి పాత్రలో శ్రీగౌరీ ప్రియ ఈ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది. ఆమె నటన చాలా హుందాగా ఉంది. ఈ జోడీ తెరపై అందంగా కనిపించింది. దర్శకుడు రవి నంబూరి సాయి రాజేశ్ కథలోని భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. సాంకేతికంగా మణిశర్మ సంగీతం సినిమాకు ప్రాణం పోశాయి. 'గుర్తుందా', 'వదలనే' పాటలు చక్కగా కుదిరాయి. విశ్వాస్ డేనియల్ ఛాయాగ్రహణం, చెన్నై వాతావరణం, వర్షం, కొన్ని క్లాసిక్ సినిమాలని గుర్తు చేసే ఫ్రేమ్స్, ఉన్నతమైన నిర్మాణ విలువలు సినిమాకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.




# రణబలి విడుదలపై అయోమయం

## దసరా లేదా దీపావళికి తీసుకువచ్చే యత్నం

కథానాయకుడు విజయ్ దేవరకొండ.. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఇప్పుడిది ఆ తేదీకి రాకపోవచ్చనే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమాని దసరా లేదా దీపావళి బరిలో దించేందుకు చిత్ర నిర్మాతలు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ చిరంజీవి 'విశ్వంభర' దసరాకి రానట్లయితే అక్టోబరు 16న దీన్ని తెరపైకి తీసుకురావాలని.. లేదంటే దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఇది 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ - అతుల్ సంగీతమందిస్తున్నారు.

## జననాయగన్ ఓపెనింగ్స్ అంతంతమాత్రమే

తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' ఎట్టకేలకు జూలై 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. రిలీజ్‌కి ముందు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే మూవీ విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి ఓపెనింగ్స్ రాకపోయినా, ఇప్పుడు సినిమా ఓటీటీ హక్కుల వ్యవహారం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దళపతి వెట్రి కొండన్ పాత్రలో కనిపించారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, మమితా బైజు కీలక పాత్రలు పోషించారు. సినిమాలో విజయ్ మాస్ ఎలివేషన్స్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఆకట్టుకున్నప్పటికీ, కథనం నెమ్మదిగా సాగడం, కొన్ని సన్నివేశాలు సాగదీతగా ఉండటంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. సినిమా విడుదలకు ముందే అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ హక్కులను సుమారు రూ.110 కోట్లకు సొంతం చేసుకునే దిశగా చర్చలు జరిపినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపించాయి. అయితే విడుదల ఆలస్యం, ఇతర కారణాలతో ఆ ఒప్పందం చివరికి కుదరలేదని సమాచారం. ఆ తర్వాత ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా హక్కులను సుమారు రూ.50 కోట్లకు దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో దాదాపు రూ.60 కోట్ల తేడాతో ఓటీటీ భాగస్వామి మారిపోయిందనే వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.







# మంగళవారం మూవీకి సీక్వెల్

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన మేకింగ్ స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'ఆర్ఎక్స్ 100' సినిమాతో దర్శకుడిగా సంచలన విజయాన్ని అందుకున్న ఆయన, 'మహాసముద్రం' తో నిరాశపరిచినా, 'మంగళవారం' చిత్రంతో మళ్లీ బ్లాక్‌బస్టర్ హిట్ సాధించారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రస్తుతం అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో రషా తడానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, మోహన్ బాబు, నరేష్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో అజయ్ భూపతి తన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.'మంగళవారం' చిత్రానికి సీక్వెల్‌పై వస్తున్న వార్తలకు అజయ్ భూపతి అధికారికంగా స్పందించారు. 'మంగళవారం 2' తప్పకుండా తెరకెక్కుతుంది. ఈసారి ప్రేక్షకులు ఊహించని స్థాయిలో కథను సిద్ధం చేస్తున్నాం. మొదటి భాగానికి పూర్తి భిన్నంగా, మరింత థ్రిల్లింగ్ అనుభూతిని అందించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈసారి కథలో సూపర్ నేచురల్ అంశాలకు పెద్దపీట వేస్తున్నామని అజయ్ భూపతి వెల్లడించారు. ప్రతి పాత్ర, ప్రతి సంఘటన ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠకు గురిచేసేలా కథను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' పనుల్లో పూర్తిగా బిజీగా ఉన్నానని, ఆ సినిమా

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com